ANN తెలుగు

Follow: @ANNTELUGU

24-04-2026

# మహా పత్రిక

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 117 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## అంతటా.. కవిత చర్చే

### కొత్త పార్టీ ప్రభావం ఎంత?

కవిత దమ్ము.. ఆత్మస్థైర్యంపై నేతల్లో భారీ అంచనాలు

టీజేపీ.. పీఆర్పీ అంత పవర్ ఫులా..

టీజేఎస్, వైఎస్సార్టీపీలా ఉంటుందా?

లెక్కలు.. అంచనాల్లో రాజకీయ పెద్దలు

ప్రత్యేక కథనం 4లో

**టాప్ న్యూస్**

### భారత్ గొప్ప దేశం



- 'నరక కూపం' వివాదం తర్వాత భారత్‌పై ట్రంప్ ప్రశంసలు

02

### ప్రతి నెలా కొలువుల జాతర

- సన్నద్ధమవుతున్న టీజీపీఎస్సీ
- త్వరలోనే 2500 పోస్టుల భర్తీకి చర్యలు

03

### అనకాపల్లిలో సోలార్ విప్లవం

- ₹5,400 కోట్లతో రీన్యూ మెగా ప్రాజెక్ట్!
- ఆత్మనిర్భర భారత్ దిశగా ఏపీ అడుగులు
- 6.5 గిగావాట్ల సోలార్ ప్లాంట్‌తో సరికొత్త రికార్డు
- యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు
- రీన్యూ మెగా ప్లాంట్‌కు భూమిపూజ



02



## నిప్పుల కొలిమిగా తెలంగాణ

- నేటి నుంచే 'హీట్‌వేవ్ 2.0' ప్రకంపనలు
- వడగండ్ల వానలు వర్సెస్ మండుతున్న ఎండలు
- 45 డిగ్రీల దిశగా ఉష్ణోగ్రతలు
- అప్రమత్తంగా ఉండండి.. అగ్నిగుండం కానున్న ఉత్తర తెలంగాణ జిల్లాలు..

**హైదరాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రం మరోమారు ప్రకృతి వైపరీత్యాల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఒకవైపు అకాల వర్షాలు, వడగండ్ల వానలతో వాతావరణం అస్థిరంగా మారుతుంటే, మరోవైపు ప్రాణాంతకమైన ఎండలు రాష్ట్ర ప్రజలను భయపెడుతున్నాయి. శుక్రవారం (ఏప్రిల్ 24)నుంచి మిగతా 2లో

## రికార్డు పోలింగ్

- బెంగాల్‌లో ఓట్ల జాతర.. తమిళనాట ప్రభంజనం
- 91.46 శాతంతో చరిత్ర సృష్టించిన బెంగాలీ ఓటరు.
- తమిళనాడు లో 84.41 శాతం రికార్డు పోలింగ్.
- కిలోమీటర్ల మేర బారులు.. అర్ధరాత్రి దాకా క్యూలైన్లు
- తమిళనాడులో ఓటింగ్ పై విజయ్ ఎఫెక్ట్.. తరలివచ్చిన తారాలోకం
- తమిళనాడులో డీఎంకే కూటమి.. బెంగాల్ లో హోరాహోరీ అంటున్న ట్రెండ్స్

వివరాలు 2లో





# రేవంత్ కేబినెట్ భరోసా

### ఆర్టీసీ కార్మికులకు చర్చల ఆహ్వానం

- మంత్రుల జీతాల్లో 50 శాతం కోత
- బకాయిల క్లియరెన్స్ కు గ్రీన్ సిగ్నల్
- అండగా ఉంటాం.. ఆత్మహత్యలు వద్దు
- రూ. 14,200 కోట్ల బకాయిల చెల్లింపునకు కసరత్తు
- సహకార సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

**హైదరాబాద్, మహా:**

సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆర్టీసీ సమ్మె, ఉద్యోగులకు బకాయిల చెల్లింపుల వంటి కీలక అంశాలపై సుదీర్ఘ చర్చ జరిపింది. కేబినెట్ సమావేశంలో కాళేశ్వరంపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ప్రాజెక్టులో అవకతవకలపై సీబీఐ విచారణ కోరుతూ కేంద్ర ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తీసుకురావాలని మంత్రివర్గం నిర్ణయించింది. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు త్వరలోనే ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మంత్రులు ఢిల్లీకి వెళ్లి సీబీఐ డైరెక్టర్ ని కలవబోతున్నారు. హైకోర్ట్ తీర్పుపై అడ్వకేట్ జనరల్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేసినట్లు సమాచారం. హైకోర్ట్ తీర్పు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలకు ఎలాంటి ఊరట లభించలేదని.. కేవలం ఐఏఎస్ అధికారులపై కమిషన్ వ్యాఖ్యలు సరికావని మాత్రమే చెప్పిందన్నారు. అలాగే, నోటీసులు అందించే విధానంపై మాత్రమే విబేధించిందన్నారు. సీబీఐ విచారణ కోరుతూ కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని మంత్రులకు సూచించారు. కాళేశ్వరంపై కోర్టుల్లో ఎలాంటి కేసులు పెండింగులో లేవన్నారు. హైకోర్ట్ తీర్పును పూర్తిగా అధ్యయనం చేశాక.. న్యాయ పరంగా ఎలా ముందుకెళ్లాలో ఆలోచిద్దామని సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

**సమ్మె విరమించాలని విజ్ఞప్తి**

ఆర్టీసీ సమ్మెను వెంటనే విరమించాలని కార్మికులను కేబినెట్ విజ్ఞప్తి చేసింది. కార్మికులు సంయమనం పాటించాలని, సమస్యలను పరిష్కరించాలనే సానుకూల వైఖరితోనే ప్రభుత్వం అధికారుల కమిటీ వేసిందని పేర్కొంది. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో చర్చలకు రావాలని కార్మిక సంఘాలను కోరింది.

**ప్యాక్స్ పాలకవర్గాల నామినేట్**

రాష్ట్రంలో పదవీ కాలం పూర్తయిన ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు నామినేట్ పద్ధతిన పాలకవర్గాలను మిగతా 2లో

### ప్రజాప్రతినిధుల జీతాల్లో 50 శాతం కోత..

రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ అందకపోవడంతో వారి కుటుంబాలు పడుతున్న ఇబ్బందులపై మంత్రివర్గం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. వారికి ఇచ్చే బకాయిల చెల్లింపులకు తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. రెగ్యులర్ ఉద్యోగులకు రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు రూ.8 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నట్లు గుర్తించింది. అవసరమైన నిధులు సర్దుబాటు చేయడంతో పాటు అవసరమైతే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల్లో నుంచి 50 శాతం కోత విధించుకునేందుకు నిర్ణయించింది. అలా మిగిలిన నిధులను రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని తీర్మానించింది. 100 రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది.

### ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఐదుగురు మంత్రుల టీమ్

- క్షణికావేశంలో నిర్ణయాలు వద్దు
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3లో

## ఆర్టీసీ సమ్మె ఉధృతం

కార్మికుల ఆత్మాహుతి యత్నాలు.. కదిలిన ప్రభుత్వ యంత్రాంగం

సమ్మెపై స్పందించిన సీఎం రేవంత్.. తొందరపడవద్దని విజ్ఞప్తి

నేడు డిప్యూటీ సీఎంతో కార్మిక నేతల భేటీ




**హైదరాబాద్, మహా :** ఆర్టీసీ సమ్మెపై కార్మికులతో మాట్లాడాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులను ఆదేశించారు. శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలోని మంత్రుల బృందం కార్మిక సంఘాలతో చర్చలు జరపనుంది. గురువారం సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో సమ్మెపై ప్రధానంగా చర్చించిన మంత్రివర్గం సమ్మెకు ఏదోలా ముగింపు పలకాలని నిర్ణయించింది. నర్సంపేట, నల్గొండ ఘటనలపై కేబినెట్లో ప్రస్తావన రావడంతో స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదని కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో దృష్టి పెట్టిందని సీఎం ప్రకటించారు. ఇందులో భాగంగా శుక్రవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు ఆర్టీసీ కార్మిక సంఘాలను పిలిచి మాట్లాడాలని ఆదేశించారు. కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండోరోజు కొనసాగుతోంది. పలుచోట్ల ఉద్యోగులు నిరసన చేపట్టారు. మిగతా 2లో

### ఎక్కడి బస్సులు అక్కడే...

తెలంగాణ రాష్ట్ర రవాణా వ్యవస్థకు వెన్నెముక వంటి టీజీఎస్ఆర్టీసీలో రాజుకున్న సమ్మె జ్వాలలు రెండో రోజుకు చేరుకోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రవాణా చక్రం అక్షరాలా స్తంభించిపోయింది. తమ 32 న్యాయమైన డిమాండ్ల సాధన కోసం దాదాపు 40 వేల మంది కార్మిక లోకం ఏకమై సమర శంఖం పూరించడంతో, పల్లె వెలుగు నుంచి గరుడ ప్లస్ వరకు అన్ని సర్వీసులు డిపోలకే పరిమితమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 97 డిపోలకు చెందిన సుమారు 6,300 సొంత బస్సులు కదలకపోవడంతో ప్రజారవాణా వ్యవస్థ కుప్పకూలింది. అధికారుల అద్దె బస్సుల ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, మొత్తం 9,300 బస్సుల వ్యవస్థలో దాదాపు 90 శాతం నిలిచిపోయింది. దీని ప్రభావం అత్యంత భయంకరంగా ఉంది. ప్రతిరోజూ ఆర్టీసీపై ఆధారపడే 60 నుంచి 65 లక్షల మంది ప్రయాణికులు దిక్కుతోచని స్థితిలో రోడ్డున పడ్డారు. ముఖ్యంగా 'మహాలక్ష్మి' పథకం ద్వారా ఉచితంగా ప్రయాణించే 35 లక్షల మంది మహిళా ప్రయాణికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. ఎండల తీవ్రత ఒకవైపు, బస్సులు లేని దుస్థితి మరోవైపు సామాన్యుడి సహనాన్ని పరీక్షిస్తోంది. ఇదే అదనుగా ప్రైవేట్ వాహనదారులు, ఆటో డ్రైవర్లు ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని నిలువు దోపిడీకి తెరలేపడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థికంగా ఈ సమ్మె సంస్థను కోలుకోలేని దెబ్బ తీస్తోంది.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికగా ప్రజా దర్బార్





- కంది శ్రీనివాసరెడ్డి ప్రజాదర్బార్ కు అనూహ్యస్పందన
- హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్
- ప్రజల నుండి వినతులు స్వీకరించి.. భరోసానిచ్చిన కేఎస్సార్

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ పట్టణం లోని ప్రజా సేవా భవన్ లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయతో పాటు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ పాల్గొని ప్రజలనుండి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలపై సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని కంది శ్రీనివాస రెడ్డి హామీ ఇచ్చారు. ప్రజల దరఖాస్తుల ను ఎంట్రీ చేసేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థనే ఏర్పాటు చేసినట్టు తెలిపారు. దీని ద్వారా సమస్యల పరిష్కానికి తీసుకోవాల్సిన చర్యలపై ఎప్పటికప్పుడు ఆటో అప్ డేట్ అవుతుందన్నారు. అటు కంది శ్రీనన్న స్వల్ప ఓడిపోయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతుండటం గొప్ప విషయమని ఈ సందర్భంగా దరఖాస్తుదారులు ప్రశంసించారు. ప్రతీవారం ఇలా ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు.

## మణుగూరులో రెడ్డీస్ కళ్యాణ మండపానికి శంకుస్థాపన..

మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు పాయం, తెల్లం హాజరు..



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం రైల్వే స్టేషన్ తోగ్గుడెం రోడ్ వద్ద నిర్మించనున్న రెడ్డీస్ కళ్యాణ మండపానికి శంకుస్థాపన కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. రెడ్డీస్ సంక్షేమ సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన మిగతా 2లో

## బడంగ్‌పేట్‌లో రూ.200 కోట్ల నిధుల గోల్‌మాల్

### సీఎం రేవంత్‌కు సబిత లేఖ

- పది మంది అధికారుల సస్పెన్షన్ కేవలం 'మంచుకొండ కొన' మాత్రమే
- అసలు సూత్రధారులను తేల్చాలి
- చెరువుల కబ్జా, అక్రమ లేఅవుట్లు, ఫైళ్ల మాయంపై ప్రత్యేక విచారణ జరపాలి
- మాజీ మంత్రి డిమాండ్



**హైదరాబాద్, మహా:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లో సుమారు 200 కోట్ల రూపాయల మేర ప్రజాధనం పక్కదారి పట్టిందని, ఈ భారీ అవినీతిపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని కోరుతూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ ఉప నాయకురాలు పి. సబితా ఇంద్రారెడ్డి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి గురువారం బహిరంగ లేఖ రాశారు. కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలకు బాధ్యులుగా చేస్తూ 10 మంది అధికారులను ప్రభుత్వం సస్పెండ్ చేయడాన్ని ఆమె స్వాగతించినప్పటికీ, వెలుగులోకి వచ్చిన ఈ ప్రాథమిక అంశాలు కేవలం 'మంచుకొండ కొన' మాత్రమేనని ఆమె అభివర్ణించారు. ఇక్కడ సాగిన వ్యవస్థీకృత అవినీతిని కూకటివేళ్లతో సహా పెకిలించాలంటే మరింత లోతైన, ప్రత్యేక విచారణ అవసరమని ఆమె సీఎం దృష్టికి తీసుకెళ్లారు. మిగతా 3లో

# రికార్డు పోలింగ్

## బెంగాల్‌లో ఓట్ల జాతర.. తమిళనాట ప్రభంజనం

- 91.46 శాతంతో చరిత్ర సృష్టించిన బెంగాలీ ఓటరు
- తమిళనాడు లో 84.41 శాతం రికార్డు పోలింగ్
- కిలోమీటర్ల మేర బారులు.. అర్ధరాత్రి దాకా క్యూలైన్లు
- తమిళనాడులో ఓటింగ్ పై విజయ్ ఎఫెక్ట్.. తరలివచ్చిన తారాలోకం
- తమిళనాడులో డీఎంకే కూటమి.. బెంగాల్ లో హోరాహోరీ అంటున్న ట్రెండ్స్

**హైదరాబాద్, మహా:** బెంగాల్. తమిళనాడు ఓటర్లు.. చైతన్యం చాటారు. బెంగాల్ ఏం చెబితే.. దేశం అది అనుసరిస్తుందన్న నానుడి ఉండేది. ఇపుడు బెంగాల్ రికార్డు పోలింగ్ తో దేశంలో సరికొత్త చరిత్రను లిఖించింది. ఎండలు మండుతున్నా, రాజకీయ సమీకరణలు ఉత్కంఠ రేపుతున్నా, అవేవీ ఓటరు సంకల్పాన్ని అడ్డుకోలేకపోయాయి. గురువారం జరిగిన ఎన్నికల పర్వంలో తమిళనాడులోని 234 నియోజకవర్గాలకు ఒకే విడతలోనూ, పశ్చిమ బెంగాల్‌లోని 152 నియోజకవర్గాలకు మొదటి విడతలోనూ పోలింగ్ ముగిసింది. ఈ రెండు రాష్ట్రాల్లో నమోదైన పోలింగ్ శాతం ప్రపంచ ప్రజాస్వామ్య దేశాలను సైతం విస్మయానికి గురిచేస్తోంది. గత ఏడు దశాబ్దాల్లో ఎన్నడూ చూడని రీతిలో ఓటరు మహాశయుడు పోలింగ్ కేంద్రాలకు పోటెత్తారు.

### తమిళనాడులో రికార్డు

దక్షిణ భారత రాజకీయాలకు గుండెకాయ వంటి తమిళనాడులో 234 నియోజకవర్గాలకు ఒకే విడతలో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా, అదే సమయంలో అత్యంత ఉధృతంగా సాగింది. రాష్ట్రంలోని మొత్తం 5.73 కోట్ల మంది ఓటర్లలో సుమారు 4.84 కోట్ల మంది తమ హక్కును వినియోగించుకోవడంతో 84.41 శాతం పోలింగ్ నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 75,032 పోలింగ్ కేంద్రాలు ఓటర్లతో కిక్కిరిసిపోయాయి. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటుందన్న అపవాదును ఈసారి చెన్నై, కోయంబత్తూర్ వంటి ప్రధాన నగరాలు తుడిచిపెట్టేశాయి. ప్రతి గ్రామం, ప్రతి నగరం పోలింగ్ కేంద్రం వైపు అడుగులు వేయడం తమిళనాట ఒక నవ చరిత్రకు నాంది పలికింది.

### బెంగాల్ గడ్డపై అసాధారణ ఓటింగ్

అటు పశ్చిమ బెంగాల్ పరిస్థితి మరింత సంచలనంగా మారింది. అక్కడ 294 స్థానాలకు గాను మొదటి విడతలో 152 స్థానాలకు జరిగిన పోలింగ్‌లో ఏకంగా 91.46 శాతం ఓటింగ్ నమోదై అఖండ చరిత్ర సృష్టించబడింది. దాదాపు 6.82 కోట్ల మంది ఓటర్లలో 6.24 కోట్ల మందికి పైగా బారులు తీరడం అంటే అది సామాన్యమైన విషయం కాదు. ఉత్తర బెంగాల్ లోని కూచ్ బెహార్ నుంచి మొదలుకొని జంగల్ మహల్ ప్రాంతాల వరకు ప్రతి ఓటరు తన హక్కును చాటుకున్నారు. ఒక రాష్ట్రంలో 90 శాతానికి పైగా పోలింగ్ నమోదు కావడం స్వాతంత్ర్య భారత ఎన్నికల చరిత్రలోనే అత్యున్నత స్థాయి రికార్డుగా కేంద్ర ఎన్నికల కమిషన్ వర్గాలు అధికారికంగా ధృవీకరించాయి.

### మహిళలు, యువత పోటెత్తిన రికార్డు పోలింగ్

ఈ చారిత్రక పోలింగ్‌లో మహిళల , యువత పాత్ర అత్యంత కీలకమని క్షేత్రస్థాయి నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఉదయం ఆరు గంటల నుంచే కిలోమీటర్ల మేర బారులు తీరిన ఓటర్లలో మహిళల సంఖ్య పురుషులతో పోటీపడటం విశేషం. వివిధ సంక్షేమ పథకాలు మరియు రాజకీయ చైతన్యం మహిళా ఓటర్లను భారీగా ప్రభావితం చేశాయని తెలుస్తోంది. అలాగే తొలిసారి ఓటు వేస్తున్న యువ ఓటర్లు తమ వేలిపై ఉన్న సిరా గుర్తును ప్రదర్శిస్తూ సెల్ఫీలు దిగడం, ఉత్సాహంగా ఓటింగ్ లో పాల్గొనడం గమనార్హం. ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ, టెంట్లను ఏర్పాటు చేసి, తాగునీటి సదుపాయాలు కల్పించడంతో ఓటర్లకు అసౌకర్యం కలగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

### సేలంలో ఓటు హక్కు వినియోగించుకున్న ఎడప్పాడి పళనిస్వామి

తమిళనాడులో ప్రధాన ప్రతిపక్షమైన ఏఐఏడీఎంకే అధినేత ఎడప్పాడి కె. పళనిస్వామి తన సొంత గడ్డపై తన హక్కును చాటుకున్నారు. సేలం జిల్లాలోని తన స్వగ్రామమైన సిలువంపాలెంలోని పంచాయతీ యూనియన్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌కు ఆయన చేరుకున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి సామాన్యుడిలా క్యూలైన్లో నిలబడి ఓటు వేయడం ద్వారా ఆయన అందరికీ ఆదర్శంగా నిలిచారు. పల్లెటూరి వాతావరణంలో తన పాత మిత్రులు, గ్రామస్తులతో ముచ్చటిస్తూ పళనిస్వామి ఓటు వేయడం అక్కడి వారిలో ఉత్సాహాన్ని నింపింది. రాష్ట్రవ్యాప్తంగా మార్పు పవనాలు వీస్తున్నాయని, తమ పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఈ సందర్భంగా ఆయన ధీమా వ్యక్తం చేశారు.

### కొలత్తూరులో కుటుంబంతో ఓటు వేసిన ముఖ్యమంత్రి స్టాలిన్

తమిళనాడు ముఖ్యమంత్రి మరియు డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ చెన్నై నగరంలోని తన ప్రాతినిధ్య నియోజకవర్గమైన కొలత్తూరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. తన భార్య దుర్గా స్టాలిన్‌తో కలిసి ఆయన ఉదయాన్నే పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. ముఖ్యమంత్రి రాకతో కొలత్తూరు ప్రాంతంలో భారీ భద్రత ఏర్పాటు చేసినప్పటికీ, ఆయన ప్రశాంతంగా తన బాధ్యతను నిర్వహించారు. మరోవైపు, ఆయన కుమారుడు మరియు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ చెన్నైలోని చేపాక్‌తిరువల్లికేని నియోజకవర్గ పరిధిలోని పోలింగ్ బూత్‌లో తన ఓటు వేశారు. డీఎంకే శ్రేణులు భారీగా తరలివచ్చి తమ నాయకులకు మద్దతు తెలపడంతో చెన్నై నగరంలో సందడి వాతావరణం నెలకొంది.



### డీఎంకేకు కలిసొచ్చిన విజయ్ ఫాక్టర్.. ట్రెండ్స్ ఇవే

ఈ భారీ పోలింగ్ శాతాన్ని రకరకాలుగా విశ్లేషిస్తున్నారు. సాధారణంగా భారీగా ఓటింగ్ నమోదైతే అది అధికార వ్యతిరేక పవనాలకు సంకేతమని ఒక వాదన ఉన్నప్పటికీ, మరోవైపు ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు పెద్దఎత్తున తరలిరావడం కూడా ఇందుకు ప్రధాన కారణమని భావిస్తున్నారు. బెంగాల్ లోని రాజకీయ ఉత్కంఠ, తమిళనాడులో పుట్టుకొచ్చిన కొత్త సమీకరణలు ఓటర్లను ఇళ్ల నుంచి బయటకు వచ్చేలా చేశాయి. పారిశ్రామిక సంబంధాల నుంచి వ్యవసాయ విధానాల వరకు ప్రతి అంశం ఈ ఎన్నికల్లో చర్చనీయాంశమైంది. తమిళనాడులో విజయ్ ఫ్యాక్టర్ కారణంగా భారీగా పోలింగ్ నమోదు కాగా, తమిళనాడు పాలిటిక్స్ లో విజయ్ సరికొత్త హిస్టరీ లిఖించడం ఖాయమైంది. డీఎంకే కూటమికి విజయ్ ఫ్యాక్టర్ కలిసొచ్చింది. పోలింగ్ దాకా బెంగాల్ లో టీఎంసీ, బీజేపీ మధ్యహోరాహోరీ ఉండగా, పోలింగ్ డే రోజు బీజేపీ వెనుకడ్డట్లు కనిపించింది. సెకండ్ ఫేజ్ బెంగాల్ విజేతను నిర్ణయించనుంది.

### కరూర్ జిల్లా ఉత్తుపట్టిలో ఓటు వేసిన అన్నామలై

తమిళనాడులో బీజేపీని గెలుపు తీరాలకు చేర్చాలని శ్రమిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలై తన స్వస్థలంలో ఓటు వేశారు. కరూర్ జిల్లాలోని ఉత్తుపట్టి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకున్న ఆయన, తన తల్లిదండ్రులు , కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. యువతలో మంచి గుర్తింపు ఉన్న అన్నామలై, తన గ్రామంలో అందరినీ పలకరిస్తూ ఓటు వేయడం విశేషం. తమిళనాడులో ఈసారి కమలం వికసిస్తుందని, అవినీతి రహిత పాలన కోసం ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని ఆయన మీడియాకు తెలిపారు. అన్నామలై ఓటు వేసిన ఉత్తుపట్టి గ్రామంలో పండుగ వాతావరణం కనిపించింది.

### మే నాలుగవ తేదీ ఫలితాల కోసం ఉత్కంఠ

తమిళనాడులో ఒకే విడతలో 234 స్థానాలకు పోలింగ్ ముగియగా, పశ్చిమ బెంగాల్ లో మొదటి దశ 152 స్థానాలకు నేటితో ప్రక్రియ పూర్తయింది. ఈ రెండు రాష్ట్రాల్లో సుమారు 11 కోట్ల మంది ఓటర్లు తమ భవిష్యత్తును ఈవీఎంలలో నిక్షిప్తం చేశారు. బెంగాల్‌లో మిగిలిన 142 స్థానాలకు ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ జరగనుంది. ఈ చారిత్రాత్మక ఎన్నికల తుది ఫలితాలు మే 4వ తేదీన విడుదల కానున్నాయి. అప్పటివరకు ఈ భారీ పోలింగ్ శాతమే రాజకీయ పార్టీల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. సీనియర్ జర్నలిస్టుగా చెప్పాలంటే, ప్రజలు పెద్దఎత్తున తరలిరావడం ప్రజాస్వామ్యానికి గొప్ప శుభసూచకం. ఈ రికార్డు స్థాయి ఓటింగ్ ఏ పార్టీకి పట్టం కడుతుందో చూడటానికి మరికొద్ది రోజులు వేచి చూడక తప్పదు.

### నీలాంగరైలో క్యూలైన్లో నిలబడి ఓటేసిన నటుడు విజయ్

తమిళ రాజకీయాల్లో సరికొత్త ఆశగా పుట్టుకొచ్చిన 'తమిళ వెట్రి కజగం' పార్టీ అధ్యక్షుడు, ప్రముఖ నటుడు విజయ్ ఓటు వేయడం నేటి ఎన్నికల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చెన్నైలోని నీలాంగరై ప్రాంతంలో ఉన్న పోలింగ్ కేంద్రానికి ఆయన చేరుకున్నప్పుడు అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. గత ఎన్నికల సమయంలో సైకిల్‌పై వచ్చి సంచలనం సృష్టించిన విజయ్, ఈసారి కూడా సామాన్యుడిలా క్యూలైన్లో వేచి ఉండి తన ఓటు వేశారు. రాజకీయాల్లోకి పూర్తిస్థాయిలో ప్రవేశించిన తర్వాత ఆయన వేసిన మొదటి ఓటు కావడంతో, దీనిపై భారీ ఉత్కంఠ నెలకొంది. విజయ్ రాకతో నీలాంగరై వద్ద భారీగా ట్రాఫిక్ నిలిచిపోవడమే కాకుండా, ఆయన అభిమానుల నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లిపోయింది.

### కూచ్ బెహార్ గడ్డపై ఓటేసిన రాజకీయ దిగ్గజాలు

పశ్చిమ బెంగాల్ మొదటి దశలో అత్యంత ఉత్కంఠ రేపిన కూచ్ బెహార్ జిల్లాలో ప్రముఖ నేతలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కేంద్ర మాజీ మంత్రి మరియు బీజేపీ కీలక నేత నిశిత్ ప్రమాణిక్ కూచ్ బెహార్‌లోని తన స్వగ్రామంలో ఓటు వేయగా, తృణమూల్ కాంగ్రెస్ మంత్రి ఉదయన్ గుహ దిన్హటా నియోజకవర్గంలో తన హక్కును చాటుకున్నారు. ఈ ఇద్దరు హేమాహేమీల మధ్య సాగుతున్న రాజకీయ పోరాటం నేడు పోలింగ్ కేంద్రాల వద్ద కూడా స్పష్టంగా కనిపించింది. కూచ్ బెహార్ ఉత్తర నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి సుకుమార్ రాయ్ కూడా తన ఓటు వేశారు. బెంగాల్ రాజకీయాల్లో కూచ్ బెహార్ ప్రాంతం ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అవకాశం ఉండటంతో ఇక్కడ భారీ ఓటింగ్ నమోదైంది.

# అనకాపల్లిలో సోలార్ విప్లవం

## ₹5,400 కోట్లతో రీన్యూ మెగా ప్రాజెక్ట్!

- ఆత్మనిర్భర భారత్ దిశగా ఏపీ అడుగులు
- 6.5 గిగావాట్ల సోలార్ ప్లాంట్‌తో సరికొత్త రికార్డు
- యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు
- రీన్యూ మెగా ప్లాంట్‌కు భూమిపూజ



**అనకాపల్లి, మహా:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రంపై నేడు ఒక అపురూపమైన , చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. అనకాపల్లి జిల్లా వేదికగా 'రీన్యూ' (సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెగా సోలార్ ఇన్గోట్ వేఫర్ ప్లాంట్‌కు శంకుస్థాపన జరగడం ద్వారా రాష్ట్ర పారిశ్రామిక ప్రస్థానంలో ఒక నవ శకం మొదలైంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా జరిగిన ఈ భూమిపూజ కార్యక్రమం కేవలం ఒక ఫ్యాక్టరీ నిర్మాణానికి పునాది మాత్రమే కాదు, ఏపీని గ్లోబల్ క్లీన్ ఎనర్జీ హబ్‌గా మార్చే సంకల్పానికి నిదర్శనం. ఆధునిక సాంకేతికతతో, పర్యావరణ హితమైన ప్రమాణాలతో నిర్మితమవుతున్న ఈ ప్రాజెక్టు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వడమే కాకుండా, దేశీయ సౌర ఇంధన తయారీ రంగంలో ఆంధ్రప్రదేశ్ పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టనుంది.

### అనకాపల్లి గడ్డపై ఐదువేల కోట్ల భారీ పెట్టుబడి

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం గజరెడ్డిపాలెం సమీపంలో ఈ భారీ సోలార్ ప్రాజెక్టు కొలువుదీరనుంది. సుమారు 5,400 కోట్ల రూపాయల భారీ వ్యయంతో రీన్యూ సంస్థ ఈ మెగా ప్లాంట్‌ను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా 6.5 గిగావాట్ల సామర్థ్యంతో సోలార్ ఇన్గోట్ మరియు వేఫర్లను తయారు చేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024' కింద ఈ ప్రాజెక్టుకు అనుమతులు లభించాయి. సంస్థకు గతంలో కుదిరిన రూ. 82,000 కోట్ల పెట్టుబడి ఒప్పందాల్లో భాగంగానే ఈ ప్లాంట్ నిర్మాణం చేపడుతుండటం గమనార్హం. కేవలం 24 నెలల స్వల్ప కాలంలోనే ఈ ప్రాజెక్టును పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

### ఆత్మనిర్భర భారత్ కు పటిష్టమైన పునాది

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయమైన 'ఆత్మనిర్భర భారత్' లక్ష్యానికి ఈ ప్రాజెక్టు ఒక పటిష్టమైన పునాదిగా నిలవనుంది. భారతదేశం ఇంధన రంగంలో స్వయం సమృద్ధి సాధించాలంటే సౌర విద్యుత్ పరికరాల తయారీలో అగ్రగామిగా ఉండాలి. ప్రస్తుతం మనం సౌర పరికరాల కోసం విదేశాలపై ఆధారపడుతున్న తరుణంలో, అనకాపల్లిలో తయారయ్యే ఇన్గోట్లు మరియు వేఫర్లు దేశీయంగా సోలార్ ప్యానెల్ల తయారీని మరింత సులభతరం చేస్తాయి. విదేశీ దిగుమతుల భారాన్ని తగ్గించడంతో పాటు, ఇంధన భద్రతను పటిష్టం చేయడంలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తోంది. క్లీన్ ఎనర్జీ ట్రాన్సిషన్ లో భారత్ ప్రపంచానికే దిక్సూచిగా మారే క్రమంలో ఏపీ అగ్రగామిగా నిలవబోతోంది.

### స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉపాధి జాతర

ఈ మెగా ప్రాజెక్టు రాకతో కేవలం పరిశ్రమలే కాకుండా, స్థానిక యువతకు భారీ ఎత్తున ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్లాంట్ ద్వారా సుమారు 2,100 మందికి పైగా ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అంచనా. క్లీన్ ఎనర్జీ రంగంలో నైపుణ్యం కలిగిన నిపుణులతో పాటు, స్థానిక యువతకు వివిధ విభాగాల్లో ఉపాధి కల్పించడమే తమ లక్ష్యమని రీన్యూ సంస్థ సీఈవో సుమంత్ సిన్హా వెల్లడించారు. పరిశ్రమల స్థాపన వల్ల కేవలం ఆదాయమే కాకుండా, స్థానిక ప్రాంతాల అభివృద్ధి మరియు నిరుద్యోగ సమస్య పరిష్కారం అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది. భవిష్యత్తులో ఈ ప్లాంట్ మరింత విస్తరించినప్పుడు ఉపాధి అవకాశాలు మరిన్ని పెరిగే అవకాశం ఉంది.

### ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌తో పురోగతి

ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధిలో ఇంధన రంగం పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అగ్రస్థానంలో నిలపాలనే లక్ష్యంతో తాము అడుగులు వేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అనకాపల్లిలో ఏర్పాటు కానున్న ఈ ప్లాంట్ వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతం ఆర్థికంగా ఎంతో పురోగతి సాధిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో తాము ప్రకటించిన పారిశ్రామిక విధానాలు నేడు కార్యరూపం దాల్చుతున్నాయని, మరిన్ని పరిశ్రమలు ఏపీకి తరలివచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సుమారు 20 వేల మందితో నిర్వహించిన బహిరంగ సభ రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రజల్లో ఉన్న ఉత్సాహాన్ని చాటిచెప్పింది.

### పర్యావరణ హితమైన అభివృద్ధిలో ఏపీ రోల్ మోడల్

పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఈ ప్లాంట్‌ను పూర్తిగా స్వచ్ఛ ఇంధనంతోనే నడిపించనున్నారు. కాలుష్య రహిత ఇంధన వనరుల వినియోగానికి పెద్దపీట వేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ పర్యావరణ హితమైన అభివృద్ధికి మారుపేరుగా నిలుస్తోంది. రాష్ట్రంలోని సహజ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుంటూ, ప్రకృతికి హాని కలగకుండా పరిశ్రమలను ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. ఈ ప్రాజెక్టు ద్వారా వెలువడే సౌర శక్తి దేశవ్యాప్తంగా కర్బన ఉద్గారాలను తగ్గించడంలో సహాయపడుతుంది. పర్యావరణహిత పారిశ్రామికీకరణలో ఏపీ ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్ గా మారుతోందని పర్యావరణవేత్తలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### రీన్యూ సంస్థ భాగస్వామ్యంతో పారిశ్రామిక గర్జన

ప్రపంచ ప్రసిద్ధి చెందిన రీన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఏపీలో ఇంతటి భారీ పెట్టుబడి పెట్టడం రాష్ట్రంపై పెట్టుబడిదారులకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోంది. నాస్డాక్ లో లిస్ట్ అయిన ఈ అంతర్జాతీయ సంస్థ అనకాపల్లి జిల్లాను తన తయారీ కేంద్రంగా ఎంచుకోవడం విశేషం. సంస్థ అధినేత సుమంత్ సిన్హా మరియు ఇతర ఉన్నత స్థాయి నాయకత్వం ఈ భూమిపూజలో పాల్గొని, రాష్ట్ర ప్రభుత్వ సహకారాన్ని కొనియాడారు. కేవలం సోలార్ మాత్రమే కాకుండా ఇతర పునరుత్పాదక ఇంధన రంగాల్లో కూడా రీన్యూ సంస్థ ఏపీలో తన కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఈ భాగస్వామ్యం భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ సంస్థలు ఏపీ వైపు చూసేలా చేస్తోంది.

### గ్లోబల్ క్లీన్ ఎనర్జీ హబ్ గా ఆంధ్రప్రదేశ్ ప్రస్థానం

ముగింపుగా చెప్పాలంటే, అనకాపల్లి రీన్యూ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక అపూర్వమైన మలుపు. 2030 నాటికి 500 గిగావాట్ల శిలాజయేతర ఇంధన సామర్థ్యాన్ని సాధించాలనే దేశ లక్ష్యంలో ఏపీ తన వంతు వాటాను ఘనంగా అందిస్తోంది. క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, మౌలిక సదుపాయాలు పారిశ్రామిక వేత్తలను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పారిశ్రామికాభివృద్ధి, పర్యావరణ హితం మరియు యువతకు ఉపాధి అనే త్రివేణి సంగమంలా ఈ ప్రాజెక్టు నిలుస్తుంది. రాబోయే రెండేళ్లలో ఈ ప్లాంట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, భారతదేశం సౌరశక్తి రంగంలో ఎవరిపైనా ఆధారపడకుండా గర్వంగా తలెత్తుకుని నిలబడుతుంది.

# భారత్ గొప్ప దేశం

## 'నరక కూపం' వివాదం తర్వాత భారత్‌పై ట్రంప్ ప్రశంసలు

**మహా:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌ను 'గొప్ప దేశం' అని అభివర్ణిస్తూ, తనకు అక్కడ ఒక 'చాలా మంచి స్నేహితుడు (మోదీ)' ఉన్నారని ప్రశంసించారు. అయితే, భారత్‌ను 'నరక కూపం' (హెల్ హోల్) అంటూ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలున్న పోడ్‌కాస్ట్‌ను రీపోస్ట్ చేసిన తర్వాత, ట్రంప్ నుంచి ఈ వ్యాఖ్యలు రావడం గమనార్హం. ఇటీవల అమెరికన్ రేడియో హోస్ట్ మైఖేల్ సేవేజ్ తన పాడ్‌కాస్ట్‌లో భారత్, చైనాలను 'నరకకూపాలు'గా అభివర్ణించారు. అమెరికాలో జన్మస్థలం ఆధారంగా పౌరసత్వం (బర్త్‌రైట్ సిటిజన్‌షిప్) ఉండటాన్ని ఆసరాగా చేసుకుని, ఆయా దేశాల మహిళలు తొమ్మిదో నెల గర్భంతో అమెరికాకు వచ్చి పిల్లల్ని కంటున్నారని, తద్వారా సులువుగా పౌరసత్వం పొందుతున్నారని ఆయన ఆరోపించారు. భారతీయులను 'ల్యాప్‌టాప్‌లతో ఉన్న గ్యాంగ్‌స్టర్లు'గా ఆయన వ్యాఖ్యానించారు. ఈ పాడ్‌కాస్ట్ వీడియోను, ట్రాన్‌స్క్రిప్ట్‌ను ట్రంప్ తన సోషల్ మీడియాలో రీపోస్ట్ చేయడంతో పెద్ద దుమారం రేగింది. ఈ వివాదం నేపథ్యంలో ట్రంప్ భారత్‌పై తన వైఖరిని స్పష్టం చేసే ప్రయత్నం చేశారు. 'భారత్ ఒక గొప్ప దేశం. ఆ దేశ నాయకత్వంలో నాకు ఒక మంచి స్నేహితుడు ఉన్నారు' అని ట్రంప్ అన్నట్లు న్యూఢిల్లీలోని అమెరికా ఎంబసీ ప్రతినిధి క్రిస్టోఫర్ ఎల్మ్స్ తెలిపారు.

# నిప్పుల కొలిమిగా తెలంగాణ

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా 'సీవియర్ హీట్‌వేవ్ 2.0' ప్రారంభం కానుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏప్రిల్ 24 నుంచి 29 వరకు సుమారు ఐదు రోజుల పాటు రాష్ట్రం నిప్పుల కొలిమిని తలపించనుందని, ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా 45 డిగ్రీల సెల్సియస్‌ను తాకే అవకాశం ఉందని 'రెడ్ అలర్ట్' జారీ చేశారు. ఈ తీవ్రమైన ఎండల ప్రభావం వల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్నం వేళ బయటకు రావడం ప్రాణాంతకమని హెచ్చరికలు వెలువడ్డాయి.

### అగ్నిగుండం కానున్న జిల్లాలు

రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే, రెడ్ మార్క్ చేసిన జిల్లాల్లో ఎండల తీవ్రత భీభత్సంగా ఉండనుంది. ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 43 నుంచి 44 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది. భాగ్యనగరం కూడా ఈ సెగ నుంచి తప్పించుకోలేదని, ఏప్రిల్ 24 29 మధ్య హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ వేడి కారణంగా ఏర్పడే స్థానిక మేఘావృత పరిస్థితుల వల్ల అక్కడక్కడ ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉన్నప్పటికీ, అవి ఎండల నుంచి ఎటువంటి ఉపశమనాన్ని ఇవ్వకపోగా, గాలిలో తేమ శాతాన్ని (హ్యుమిడిటీ) పెంచి ఉక్కపోతను మరింత తీవ్రం చేస్తాయని స్పష్టం చేశారు.

### నేడు వడగండ్ల బీభత్సం.. అప్రమత్తమైన అధికార యంత్రాంగం

ప్రస్తుత వాతావరణం విషయానికి వస్తే, గురువారం సాయంత్రం హైదరాబాద్‌లోని నేరేడ్‌మెట్, మల్కాజిగిరి, కాప్రా, అల్వాల్, యాప్రాల్, ఉప్పల్ వంటి పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల వడగండ్ల వాన కూడా పడే సూచనలు ఉన్నాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే మేడ్చల్‌మల్కాజిగిరి, వికారాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, కరీంనగర్, మంచిర్యాల, కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల్లో రాబోయే కొద్ది గంటల్లో తీవ్రమైన ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. తదనంతరం కామారెడ్డి, సంగారెడ్డి, నాగర్‌కర్నూల్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో కూడా వర్ష ప్రభావం ఉండనుంది. అయితే ఈ వానలు రేపటి నుంచి రాబోయే 'మహా తాపం' ముందు వచ్చే ఒక చిన్నపాటి ఉపశమనం మాత్రమేనని, రేపటి నుంచి ప్రజలు ఎండ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.




# మణుగూరులో రెడ్డీస్ కళ్యాణ మండపానికి శంకుస్థాపన..

## మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యేలు పాయం, తెల్లంలు హాజరు..

(మొదటిపేజీ తరువాయి)

ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావులు ముఖ్య అతిథులుగా హాజరై శంకుస్థాపన చేసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కళ్యాణ మండపం నిర్మాణం ద్వారా సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు మంచి వేదిక లభిస్తుందని పేర్కొన్నారు. సమాఖ్య సభ్యులను అభినందిస్తూ, భవన నిర్మాణాన్ని నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మణుగూరు ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కళ్యాణ మండపం సమాజ ఐక్యతకు కేంద్రంగా నిలవాలని, ప్రజలకు అందుబాటులో అన్ని సౌకర్యాలతో నిర్మించాలని ఆకాంక్షించారు. రెడ్డీస్ సంక్షేమ సమాఖ్య చేపట్టిన ఈ శుభకార్యాన్ని అభినందిస్తూ నిర్మాణ పనులకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీసీసీ అధ్యక్షులు తోట దేవి ప్రసన్న, సమాఖ్య ప్రతినిధులు, మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రేవంత్ కేబినెట్ భరోసా

(మొదటిపేజీ తరువాయి)

నియమించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో సూపరింటెండెంట్‌కు పాలకవర్గాలు ఏర్పడనున్నాయి.

**పీపీపీ పద్ధతిలో గచ్చిబౌలి స్టేడియం అభివృద్ధి**

గచ్చిబౌలి స్టేడియాన్ని పీపీపీ పద్ధతిలో అభివృద్ధి చేసే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న 76 ఎకరాల్లో 64 ఎకరాల్లో 21 రకాల క్రీడా సౌకర్యాలు కల్పించడంతో పాటు అవుట్ డోర్ స్టేడియం సామర్థ్యం 20 వేల నుంచి 50 వేలకు పెంచాలని నిర్ణయించింది. స్విమ్మింగ్ పూల్ సామర్థ్యం పెంపుతో పాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మిగిలిన 12 ఎకరాలను డెవలపర్స్ కు ఇచ్చి వాణిజ్య అవసరాలకు అద్దెకు ఇవ్వనుంది. ఇలా వచ్చిన నిధులతో స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్వహణ, క్రీడాకారుల వసతి, శిక్షణ ఇతర కార్యక్రమాలకు ఉపయోగించాలని నిర్ణయించింది.

**చిన్న కాళేశ్వరం భూ సేకరణకు గ్రీన్ సిగ్నల్**

మంథని నియోజకవర్గ ప్రాంత ప్రజల చిరకాల కోరిక చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ పూర్తి చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మహదేవ్‌పూర్, కాటారం, మల్హర్ రావు, మహాముత్తారం మండలాల్లో దాదాపు 45 వేల ఎకరాలకు, 63 గ్రామాల ప్రజలకు ఈ ప్రాజెక్టుతో ప్రయోజనం చేకూరుతుంది. ఈ ప్రాజెక్టుకు దాదాపు 2,427 ఎకరాల భూమి అవసరం కాగా, ఇప్పటి వరకు 1,020 ఎకరాలను సేకరించారు. మిగిలిన భూసేకరణకు అవసరమయ్యే రూ.166.67 కోట్ల ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటు**

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలోని మంచిర్యాల జిల్లా హాజీపూర్ రెవెన్యూ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఆక్వా పార్క్ ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇరిగేషన్ శాఖకు చెందిన 85.10 ఎకరాలను మత్స్య శాఖకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# ఆర్టీసీ ఉద్యోగుల ఆత్మహత్యా యత్నాలకు ప్రభుత్వానిదే బాధ్యత

**మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్**

**శంకర్ గౌడ్ ను పరామర్శించిన మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యేలు**

**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఆర్టీసీ డిపోలో గురువారం ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం తీవ్ర కలకలం రేపింది. తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న మనస్తాపంతో డ్రైవర్ శంకర్ గౌడ్ పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నారు. తోటి సిబ్బంది వెంటనే మంటలు ఆర్పి, హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా ఎంజీఎం వైద్యులు శంకర్ గౌడ్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో మెరుగైన చికిత్స కోసం పోలీసుల ప్రత్యేక అంబులెన్స్ లో హుటాహుటిన హైదరాబాద్ కు తరలించడం జరిగింది. ప్రస్తుతం ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తో కలిసి మాజీ ఎమ్మెల్యేలు నన్నపునేని నరేందర్, పెద్ది సుదర్శన్ రెడ్డి పరామర్శించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం సాయంత్రం వరంగల్ తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యేలతో కలిసి ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లి శంకర్ గౌడ్ ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులను కలిసి శంకర్ గౌడ్ ఆరోగ్య పరిస్థితి పై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలియజేయడంతో నరేందర్ ఆవేదన వ్యక్తం చేస్తూ మెరుగైన చికిత్సను అందించాలని డాక్టర్లను సూచించారు. శంకర్ గౌడ్ త్వరగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు. అనంతరం నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యంతోనే ఆర్టీసీ ఉద్యోగులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని దీనికి పూర్తి బాధ్యత ప్రభుత్వమే వహించాలని నరేందర్ డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి వారికి తగిన న్యాయం చేయాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని నరేందర్ డిమాండ్ చేశారు.



# బడంగ్‌పేట్‌లో రూ.200 కోట్ల నిధుల గోల్‌మాల్

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా జల వనరుల పరిరక్షణ విషయంలో బడంగ్‌పేట్ పరిధిలోని చెరువులు, కుంటలు తీవ్రంగా కబ్జాకు గురయ్యాయని సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. తక్షణమే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను నిర్ణయించి ఆ వివరాలను బహిరంగపరచాలని డిమాండ్ చేశారు. నాలాలను కబ్జా చేసి అక్రమంగా రియల్ ఎస్టేట్ వెంచర్లు చేసిన వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ధ్వంసమైన నాలాలను పునరుద్ధరించాలని ఆమె పేర్కొన్నారు. భవన నిర్మాణ అనుమతుల విషయంలో కొందరు అధికారులు నిబంధనలను తుంగలో తొక్కి, ఒక్కో ఫ్లోర్ పైనే ఏకంగా పది వరకు ఇంటి నిర్మాణ అనుమతులు మంజూరు చేయడం వారి బరితెగింపుకు నిదర్శనమని మండిపడ్డారు. గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్న సమయంలో కార్పొరేషన్ గా మారే ముందు మాజీ సర్పంచ్ తీర్మానాల పేరుతో చేసిన అక్రమ లేఅవుట్లపై, నిబంధనలకు విరుద్ధంగా కట్టించుకున్న ఎల్‌ఆర్‌ఎస్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజాధనం దుర్వినియోగం విషయంలో కాంట్రాక్టర్ల పాత్రను కూడా ఆమె ఎండగట్టారు. పనులు పూర్తి చేయకుండానే బిల్లులు డ్రా చేసిన పనుల వివరాలను బహిరంగం చేయాలని, సదరు కాంట్రాక్టర్ల నుండి ఆ సొమ్మును రికవరీ చేసి వారిని వెంటనే 'బ్లాక్ లిస్ట్'లో చేర్చాలని సూచించారు. ప్రభుత్వ నిధులతో ప్రైవేట్ వెంచర్లలో పనులు చేసిన వారి నుండి కూడా నిధులు రికవరీ చేయాలని, పనులు జరగని పక్షంలో శాంక్షన్ ఆర్డర్లను రద్దు చేసి వెంచర్ ఓనర్లపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయంలో ఆడిట్ల కీలకమైన ఫైళ్లను ఉద్దేశపూర్వకంగా మాయం చేసిన సూత్రధారులను గుర్తించి, వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. కేవలం కింది స్థాయి అధికారులనే కాకుండా, వారి వెనుక ఉండి ఈ భారీ అక్రమాలను ప్రోత్సహించిన మరియు అండగా నిలిచిన 'అదృశ్య శక్తుల'ను విచారణ పరిధిలోకి తీసుకువచ్చినప్పుడే నిజమైన న్యాయం జరుగుతుందని సబితా ఇంద్రారెడ్డి ముఖ్యమంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు.

# డబ్బు కోసమే హత్య

- హత్య కేసును ఛేదించిన మిల్స్ కాలనీ పోలీసులు
- నిందితుడి అరెస్ట్ రిమాండ్ కు తరలింపు




**మహా వరంగల్ బ్యూరో ;** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అజాం జాహి మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 18 వ తేదీన శంభునిపేట బుడగ జంగాల కాలనీలో బీహార్ కు చెందిన వ్యక్తి హత్య కేసును మిల్స్ కాలనీ పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించిన హత్య వివరాలతో పాటు నిందితుడి వివరాలను విలేకరుల సమావేశంలో మిల్స్ కాలనీ సిఐ బొల్లం రమేష్ వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోనే సంచలనం సృష్టించిన హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. పోలీసుల చురుకుదనాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, బిహార్ రాష్ట్రానికి చెందిన తాన్వీర్ అలం (23) ఉపాధి కోసం మూడు నెలల క్రితం వరంగల్ కు వచ్చి రామన్నపేటలో నివసిస్తూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అప్పుల ఒత్తిడి కారణంగా డబ్బు కోసం తహతహలాడుతున్న నిందితుడు, ఏప్రిల్ 18న అండర్ బ్రిడ్జ్ సమీపంలోని వైన్ షాప్ వద్ద తన స్వరాష్ట్రానికి చెందిన దూరిషా (60) అనే వ్యక్తితో పరిచయం ఏర్పరుచుకున్నాడు.పరిచయాన్ని స్నేహంగా మార్చుకున్న నిందితుడు, బాధితుడి వద్ద డబ్బు ఉందని గమనించి దోపిడీకి పథకం రచించాడు. అనంతరం ఇద్దరూ రంగశాయిపేటలోని బాధితుడి గదికి వెళ్లి మద్యం సేవించారు. మద్యం మత్తులో బాధితుడు నిద్రలోకి జారుకున్న సమయంలో అతని వద్ద ఉన్న నగదును దొంగిలించడానికి ప్రయత్నించగా, బాధితుడు మేల్కొని ప్రతిఘటించాడు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది.ఈ సమయంలోనే తన పై కేసు నమోదవుతుందనే భయంతో నిందితుడు అక్కడే ఉన్న కత్తితో దాడి చేసి బాధితుడిని గొంతు కోసి హత్య చేశాడు. అనంతరం రూ. 4,500 నగదును దోచుకుని, నేరానికి ఉపయోగించిన కత్తిని సమీపంలోని పొదల్లో పడేసి అక్కడి నుండి పరారయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజ్ సమాచారదారుల సహకారంతో నిందితుడిని శంబునిపేట జంక్షన్ వద్ద గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి నేర సమయంలో ధరించిన దుస్తుల తో పాటు హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఆదేశాల మేరకు, మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ బి. రమేష్ ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది సమన్వయంతో ఈ కేసును వేగంగా ఛేదించారు.ఈ కేసును ఎంతో చాకచక్యంగా త్వరితగతిన ఛేదించిన పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# పిల్లలు మొబైల్ ఫోన్ కు బానిస కావద్దు

- పిల్లలకు నాణ్యమైన చదువు, పౌష్టికాహారాన్ని అందించాలి
- ఆస్తి కన్నా జ్ఞానం మిన్న
- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



**మహా వరంగల్ బ్యూరో;** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా వెల్ఫేర్ విభాగంలో గురువా అశోక్ నగర్ లో జరుగుతున్న తల్లిదండ్రుల ఉపాధ్యాయ సమావేశానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద పాల్గొన్నారు.సంక్షేమ వారోత్సవాలలో భాగంగా గురువారం ఖానాపూర్ మండల అశోక్ నగర్ పిల్లల తల్లిదారులు, ఉపాధ్యాయులు ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పిల్లలకు నాణ్యమైన చదువు తో పాటు పౌష్టిక ఆహారాన్ని అందించే దిశగా కంప్లైంట్ బాక్సు ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా పిల్లల సమస్యలు పరిష్కరించే దిశగా కమిటీలను కూడా ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలల లో హాజరు శాతాన్ని పెంచేందుకు కృషి చేయడం జరిగిందని, అలాగే వచ్చే విద్య సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.అదేవిధంగా ప్రతి పాఠశాలకు ఒక స్పెషల్ ఆఫీసర్ ను ఏర్పాటు చేసి వారు ప్రతి వారం పాఠశాలను సందర్శించి విద్యాపరమైన విషయాలను, భోజన సదుపాయాలను, మౌలికపరమైన అంశాలను క్రోడీకరించి, వాటి పై చర్చించి ఆ సమస్యలకు పరిష్కార మార్గాలను ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరిగిందని వారు పేర్కొన్నారు.విద్యార్థులు పెద్దలను గౌరవించాలని, మొబైల్స్ కు బానిసగా కాకూడదని, చిన్న చిన్న విషయాలకు కృంగిపోకూడదు అని ప్రతి పాఠశాలలో స్ఫూర్తి ప్రోగ్రాం ద్వారా మోటివేషన్ క్లాసులు కూడా నిర్వహిస్తున్నామని తెలిపారు.తల్లిదండ్రులు విద్యార్థులకు ఆస్తిపాస్తుల కంటే జ్ఞానాన్ని అందించాలని తద్వారా వారు వ్యక్తిగతంగా రాణించడమే కాకుండా కుటుంబానికి, దేశానికి ఉపయోగపడతారని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో తెలుగు పద్యాలు చదివించి వాటి భావాలను తెలపాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం పలు సాంస్కృతిక కార్యక్రమాల్ని నిర్వహించారు. ప్రతి క్లాసులో అత్యంత ప్రతిభావంతులైన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సన్మానం చేశారు. ఈ సమావేశంలో డి బి సి డబ్ల్యూ వో పుష్పలత , అడిషనల్ డి ఆర్ డి ఓ రేణుక , పాఠశాల ప్రిన్సిపాల్ సురేందర్, డైరెక్టర్ దామోదర్ రెడ్డి,వైస్ ప్రిన్సిపాల్ అనూష, సాయిల తో పాటు ఉపాధ్యాయ ఉపాధ్యాయేత సిబ్బంది, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మె ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

సమ్మెను విఫలం చేసేందుకు యాజమాన్యం, ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల పట్ల కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సమ్మె ఉద్రిక్తంగా మారింది. గురువారం రెండు చోట్ల ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న కోలా శంకర్ గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయకుండా కాలయాపన చేయడాన్ని నిరసిస్తూ నర్సంపేట బస్టాండ్ ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన కోలా శంకర్ గౌడ్‌ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అనంతరం డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. 80 % కాలిన గాయాలతో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సత్య శారద, సీపీ సన్‌ప్రీత్ సింగ్‌లు ఎంజీఎం ఆస్పత్రికి చేరుకుని కార్మికుడి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో మాట్లాడారు.

**ఉద్రిక్తంగా..**

మరోవైపు నల్గొండలో కూడా ఆర్టీసీ కార్మికుల సమ్మె ఉద్రిక్తంగా మారింది. మిర్యాలగూడ డిపోలో డ్రైవర్‌గా పని చేస్తున్న వెంకన్న నల్గొండ డిపో వద్ద ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యకు యత్నించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, తోటి ఆర్టీసీ కార్మికులు ఆయన్ను రక్షించారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ రెండు ఘటనలతో ప్రభుత్వంలోనూ కదలిక వచ్చింది. సమస్యల పరిష్కారం కోసం పోరాడటం తప్పుకాదని, ఆత్మత్యాగాలకు ప్రయత్నించడం సరైంది కాదని మంత్రివర్గం అభిప్రాయపడింది. సీఎం కూడా ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు

- అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియ
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో గురువారం నూతన మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని 252 జీవో ననుసరించి అర్హులైన జర్నలిస్ట్ కు అక్రిడిటేషన్లు అందజేస్తామని జిల్లా కలెక్టర్, అక్రిడిటేషన్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ సత్యశారద తెలిపారు. వరంగల్ జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్ ఛాంబర్లో జరిగింది.ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అక్రిడిటేషన్ కోసం ఆన్లైన్ ద్వారా ఐపిఆర్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న దరఖాస్తులను జీవో ననుసరించి క్షుణ్ణంగా పరిశీలించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా పంపిణీ చేసేందుకు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు ప్రయత్నించాలని ఆమె సూచించారు.అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డు అందే విధంగా కృషి చేస్తామని కలెక్టర్ అన్నారు. ప్రజాస్వామ్యంలో మీడియా కీలకపాత్ర పోషిస్తుందని, నిజమైన సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్న పాత్రికేయులకు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా 20262028 సంవత్సరానికి నూతన కార్డులు జారీచేసే పక్రియ ను వేగవంతం చేయాలని వారు పేర్కొన్నారు.అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ నిరంతర ప్రక్రియని ఆమె పేర్కొన్నారు .ఎవరు కూడా ఆందోళనకు గురి కాకుండా జర్నలిస్టులు ఆన్లైన్లో అప్లై చేసుకోవాలని జర్నలిస్టులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిపిఆర్ఓ ప్రేమలత, వరంగల్ జిల్లా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు శ్రీరాం రాంచందర్, మెండు రవీందర్, దొంతు నవీన్, బోడిగ శ్రీనివాస్, మట్టా దుర్గాప్రసాద్, కోదాటి గోపాలకృష్ణ, పల్లెల సోమేశ్వర్, హుస్సేన్ పాషా, బొల్లపల్లి రాజు పాల్గొన్నారు.

# ఆర్టీసీ డ్రైవర్ మృతి



**మహా వరంగల్ బ్యూరో;** వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో వద్ద గురువారం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ కార్మికులు చేపట్టిన సమ్మె తీవ్ర రూపం దాల్చింది. నిరసన ప్రదర్శనలో పాల్గొన్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్, అధికారుల తీరుపై తీవ్ర మనస్తాపానికి గురై అందరూ చూస్తుండగానే ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం స్థానికంగా కలకలం రేపింది. తమ డిమాండ్ల సాధన కోసం నర్సంపేట డిపో కార్మికులు గురువారం డిపో గేటు ముందే భారీ ధర్నా చేపట్టారు. నిరసన హోరెత్తుతున్న సమయంలో, ఆందోళనలో ఉన్న డ్రైవర్ శంకర్ గౌడ్ ఒక్కసారిగా తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను ఒంటిపై పోసుకుని నిప్పంటించు కున్నారు. క్షణాల్లో మంటలు చెలరేగడంతో తోటి కార్మికులు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది మంటలను ఆర్పివేసి, బాధితుడిని చికిత్స నిమిత్తం హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించి నప్పటికి ఆయన పరిస్థితి విషమంగా ఉండడంతో ఎంజీఎం వైద్యులు హైదరాబాద్ కు తరలించాలని తెలపడంతో ప్రత్యేక అంబులెన్స్ లో శంకర్ గౌడ్ తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి

# ఐదుగురు మంత్రుల టీమ్

## క్షణికావేశంలో నిర్ణయాలు వద్దు

## మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్, మహా :** సమ్మెబాట పట్టిన ఆర్టీసీ కార్మికులు క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. తెలంగాణ కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత నిర్వహించిన మీడియా సమావేశంలో.. కేబినెట్ తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. కేబినెట్ లో కార్మికుల డిమాండ్లు, సమస్యల పరిష్కారంపై కీలకంగా చర్చించామని, రేపు ఐదుగురు మంత్రులు కార్మిక సంఘాలతో చర్చిస్తారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు, ఆర్టీసీ కార్మికుల విషయంలో ప్రభుత్వం పాజిటివ్ గానే ఉందన్నారు. నర్సంపేట, నల్గొండలో ఆర్టీసీ కార్మికుల ఆత్మహత్యాయత్న ఘటనలపై కేబినెట్ తీవ్ర దిగ్భ్రాంతి చెందిందన్నారు. కార్మికులు ఎవరూ క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. అలాగే మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాలని నిర్ణయించామని మంత్రి ఉత్తమ్ వెల్లడించారు. రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ లో సుమారు రూ.6 వేల కోట్ల బకాయిలున్నాయని, నెక్స్ట్ కేబినెట్ సమావేశమయ్యే నాటికి వారికి ఇవి ఎలా ఇవ్వాలన్నదానిపై క్లారిటీ ఇస్తామన్నారు. కాళేశ్వరం పై మాట్లాడుతూ.. ప్రాజెక్టుపై హైకోర్టు తీర్పు కాపీ కేబినెట్ కు అందిందని తెలిపారు. హైకోర్టు తీర్పు తమకు అనుకూలంగా వచ్చిందని బీఆర్ఎస్ నేతలు సంబరాలు చేసుకున్నారని, ఏదో సాధించామని హడావుడి చేశారన్నారు. ఘోష్ కమిషన్ విచారణ రాజ్యాంగ విరుద్ధమైందని కోర్టు చెప్పిందని గుర్తు చేశారు. కాళేశ్వరంలో లోపాలకు కేసీఆర్, హరీష్ రావు కారణం కాదని కోర్టు చెప్పలేదన్న విషయాన్ని గుర్తించాలన్నారు. ప్రాజెక్టు ప్రొసిజర్ టెక్నికల్ విషయాన్ని మినహాయిస్తే.. మిగతా విషయాలను కోర్టు తప్పు పట్టలేదన్నారు. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కూడా కేబినెట్ నిర్ణయించిందని, త్వరలోనే ఎన్నికల తేదీలు వెల్లడిస్తామని తెలిపారు. సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ , వాకిటి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# అపర భగీరథుడు భగీరథ మహర్షి

- ఘనంగా శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**మహా వరంగల్ బ్యూరో;** లోక కల్యాణం కోసం దివి నుంచి భువికి పవిత్ర గంగాజలాన్ని తీసుకువచ్చిన అపర భగీరథుడు మహనీయుడు భగీరథ మహర్షి అని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ భగీరథ మహర్షి జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తదితరులు పాల్గొని భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భగీరథ మహర్షి జయంతిని అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొంటూ అధికారికంగా నిర్వహిస్తున్నందున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సగరుల ఆశాజ్యోతి అయిన భగీరథ మహర్షి గంగను భూమికి తీసుకువచ్చిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు.ఈ సందర్భంగా భగీరథ మహర్షి జయంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహ స్వామి, జిల్లా సగర సంఘం అధ్యక్షుడు నలుబోల సతీష్, సగర సంక్షేమ అధ్యక్షుడు సీతా కమలాకర్ రావు, నెక్కొండ కిషన్, రాష్ట్ర కోశాధికారి వడ్లకొండ కుమారస్వామి, రాష్ట్ర సగర మహిళా అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి, తాడిశెట్టి విద్యాసాగర్, అయోధ్య మంగనూరి రఘు, కోడిపాక గణేష్‌కుమార్, కానిగంటి రవి తదితరులు పాల్గొన్నారు.

# 100 కోట్లు ప్రభుత్వ భూమిని కాపాడిన హైడ్రా...

## 625/2 సర్వే నెంబర్ 9.5 ఎకరాల ప్రభుత్వ భూమి చుట్టూ కంచె, హైడ్రా పరిరక్షణలో ప్రభుత్వ భూమి బోర్డులు ఏర్పాటు






**రాజేంద్రనగర్ మహా ;** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ రెవెన్యూ పరిధిలోని ఎయిర్పోర్ట్ కాలనీలో సుమారు 100 కోట్ల విలువచేసే (కంచెభూమి) 625/2 9.5 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి హైడ్రాధికారులు కాపాడి ప్రభుత్వ బోర్డులు ఏర్పాటు చేశారు. కొన్ని సంవత్సరాలుగా అక్రమార్కుల చెర నుంచి ప్రభుత్వ భూమి (కంచె భూమి) కి హైడ్రాధికారులు విముక్తి కలిగించారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని స్థానికులు రెవెన్యూ, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. రాజకీయ నాయకుల అండదండలతో రెవెన్యూ అధికారులు కబ్జాకు గురైన ప్రదేశానికి వెళ్తూ వస్తూ కాలయాపన చేశారు. అధికారులు విచారణ చేపట్టి కబ్జా జరిగింది వాస్తవమే అన్నా రిపోర్టు రావడంతో హైడ్రాధికారులు భారీ పోలీసుల బందోబస్తు మధ్య బుధవారం కూల్చివేతలు చేపట్టారు.9.5 ఎకరాల (కంచె ) ప్రభుత్వ భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి హైడ్రా పరిరక్షణలో ఉంటుందని బోర్డులు ఏర్పాటు చేశారు. ఫెన్సింగ్, బోర్డులు ఏర్పాటు చేయడంతో స్థానికులు ఫిర్యాదుదారులు హర్షం వ్యక్తం చేశారు.

# ప్రతి నెలా కొలువుల జాతర

- సన్నద్ధమవుతున్న టీజీపీఎస్సీ
- త్వరలోనే 2500 పోస్టుల భర్తీకి చర్యలు

**హైదరాబాద్, మహా :** ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ కోసం తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ( టీజీపీఎస్సీ ) అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇక నుంచి ప్రతీ నెల ఒక నోటిఫికేషన్ విడుదల చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిన 2500 ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు చేపట్టింది. టౌన్ ప్లానింగ్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (పీసీబీ), అగ్రికల్చర్, ఏఈ, డిప్యూటీ ఈఓ సహా పలు రకాల ఉద్యోగాల భర్తీకి టీజీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే కొన్ని పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ రిలీజ్ చేయగా.. మిగతా పోస్టుల భర్తీకి ప్లాన్ చేస్తోంది. ఇప్పటి నుంచి నోటిఫికేషన్లను జారీ చేయడంలో ఎలాంటి ఆలస్యం చేయకుండా.. అభ్యర్థులు ప్రిపేర్ అయ్యేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు కసరత్తులు చేపట్టింది. ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిన సుమారు 2,500 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు, పరీక్షల షెడ్యూల్ తయారు చేసే పనిలో టీజీపీఎస్సీ అధికారులు నిమగ్నమయ్యారు. ఈ నేపథ్యంలోనే చాలా రోజుల తర్వాత తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ సైంటిస్ట్ (అనలిస్ట్ గ్రేడ్ 2) పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవల టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది.పీసీబీ అసిస్టెంట్ సైంటిస్ట్ పోస్టుల భర్తీకి ఈనెల 27వ తేదీ నుంచి దరఖాస్తులు ప్రారంభం కానున్నాయి. త్వరలోనే అదే విభాగంలోనే మరో 6, 7 రకాల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చేందుకు కూడా చర్యలు చేపట్టింది. వీటితోపాటు కీలకమైన టౌన్ ప్లానింగ్, అగ్రికల్చర్ ఆఫీసర్లు.. పలు శాఖల్లోని అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) పోస్టుల భర్తీకి కూడా కమిషన్ అధికారులు దృష్టి సారించారు. ఇక విద్యా శాఖలోనూ డిప్యూటీ ఈఓలు, డైట్ లెక్చరర్లు, బీఈడీ లెక్చరర్ల పోస్టులతో పాటు ఆర్టీసీ, సివిల్ సప్లై విభాగాల్లోని పలు పోస్టుల భర్తీకి అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. రకరకాల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు జారీ చేయడమే కాకుండా.. పరీక్షలు నిర్వహించడంలోనూ సరికొత్త విధానాన్ని పాటించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ఇతర రాష్ట్రస్థాయి ఉద్యోగాలతోపాటు.యూపీఎస్సీ, ఎస్ఎస్సీ వంటి నేషనల్ లెవల్ పరీక్షల తేదీలను దృష్టిలో పెట్టుకుని.. టీజీపీఎస్సీ పరీక్షల షెడ్యూల్‌ను తయారు చేస్తోంది. దీంతో కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ పరీక్షలు రాసే నిరుద్యోగులకు.. ఎలాంటి ఇబ్బంది లేకుండా చేయనుంది.

**ఓటీఆర్ అప్ డేట్ తప్పనిసరి అంటున్న అధికారులు**

వన్ టైం రిజిస్ట్రేషన్ (ఓటీఆర్) అప్‌డేట్ చేయాలని ఇప్పటికే టీజీపీఎస్సీ పేర్కొన్నా.. చాలామంది నిరుద్యోగులు మాత్రం చేసుకోకపోవడం గమనార్హం. తెలంగాణలో సుమారు 30 లక్షల మంది ఓటీఆర్ కలిగి ఉండగా.. వారిలో 12 లక్షల మంది మాత్రమే రెగ్యులర్‌గా పలు పరీక్షలకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఓటీఆర్ అప్‌డేట్ చేసుకోవాలని.. అందుకు గడువు 2 సార్లు పెంచినా ఇప్పటికీ కేవలం 6 లక్షల మంది మాత్రమే అప్‌డేట్ చేసుకున్నట్టు టీజీపీఎస్సీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొత్త ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలంటే అభ్యర్థులు తప్పనిసరిగా ఓటీఆర్ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపాయి.

# అంతటా.. కవిత చర్చే

## కొత్త పార్టీ ప్రభావం ఎంత?

### కవిత దమ్ము.. ఆత్మస్థైర్యంపై నేతల్లో భారీ అంచనాలు

### టీజేపీ.. పీఆర్పీ అంత పవర్ ఫులా.. టీజేఎస్, వైఎస్సార్టీపీలా ఉంటుందా?

### లెక్కలు.. అంచనాల్లో రాజకీయ పెద్దలు



(మహా ప్రత్యేకం)

తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు ఎక్కడ చూసినా కల్వకుంట్ల కవిత కొత్త పార్టీ గురించిన చర్చలే నడుస్తున్నాయి. ముఖ్యంగా ఏప్రిల్ 25న ఆమె పార్టీని అధికారికంగా ప్రకటించబోతుండటంతో, రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన సమీకరణాలు తెరపైకి వస్తున్నాయి. "రాజకీయాల్లో ఏ పార్టీ అయినా పుట్టకతోనే పెద్దది కాదు, కానీ కవితకు ఉన్న ఆత్మస్థైర్యం, రాజకీయ అనుభవం ఈ కొత్త పార్టీని కేవలం 'నామమాత్రపు' పార్టీగా కాకుండా ఒక 'కీలక శక్తి'గా మార్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. సాధారణంగా రాజకీయాల్లో ఏదైనా కొత్త పార్టీ వస్తుందంటే అధికారంలో ఉన్న పార్టీని టార్గెట్ చేయడం చూస్తుంటాం. కానీ కవిత మాత్రం అందరి రూటు మార్చి తన సొంత పార్టీ అయిన బీఆర్ఎస్ మీదనే కన్నేశారు. తండ్రి కేసీఆర్ నిర్మించిన సామ్రాజ్యాన్ని ఆమె ఏ విధంగా తన వైపు తిప్పుకోబోతున్నారు అనేదే ఇప్పుడు హాట్ టాపిక్ అయిపోయింది. తన అస్తిత్వం కోసం తండ్రి పార్టీనే దెబ్బకొట్టక తప్పని పరిస్థితి ఆమెకు ఏర్పడింది. ప్రస్తుతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని బలం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇమేజ్ ముందు ఇప్పుడు కాంగ్రెస్ లో ఏ నాయకుడు కూడా నిలబడలేని పరిస్థితి కనిపిస్తోంది. అందుకే కవిత తన వ్యూహాన్ని మార్చారు. అధికారపార్టీకి బదులు ప్రతిపక్షంపై కన్నేస్తే బలాన్ని తేలికగా పెంచుకోవచ్చని అంచనా వేస్తున్నారు. కేసీఆర్ పదేళ్ల పాలన తర్వాత బీఆర్ఎస్ ఇప్పుడు బాగా బలహీనపడింది. వరుస ఓటములతో ఆ పార్టీ క్యాడర్ మొత్తం నిరాశలో ఉంది. నాయకత్వం కూడా కార్యకర్తలకు భరోసా ఇవ్వలేకపోతోంది. ఇదే గ్యాప్‌ను కవిత క్యాష్ చేసుకోవాలని చూస్తున్నారు.

### గులాబీ కోటలో చీలిక

బీఆర్ఎస్ పార్టీకి క్షేత్ర స్థాయిలో బలమైన ఓటు బ్యాంకు ఉంది. కార్యకర్తలు కేసీఆర్ సిద్ధాంతాలను నమ్ముతారు కానీ ఇప్పుడు పార్టీలో జరుగుతున్న పరిణామాలు వారికి నచ్చడం లేదు. పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు కార్యకర్తలను అయోమయంలో పడేస్తున్నాయి. కవిత ఈ బలహీనతను తన బలంగా మార్చుకోవాలని ప్లాన్ చేశారు. బీఆర్ఎస్ లోని అసంతృప్త నేతలను తన వైపు తిప్పుకోవడం ద్వారా తండ్రి పార్టీని ఖాళీ చేయాలని ఆమె చూస్తున్నారు. తనను కాదనుకున్న పార్టీని.. తాను ప్రత్యర్థిలాగే చూడాలని, బలహీన పరచాలని కవిత డిసైడయ్యారు. తెలంగాణ ప్రజలకోసం.. ఓ పార్టీ. అది తన పార్టేనని కవిత ప్రకటిస్తున్నారు.



## కవిత కొత్త జెండా ఎజెండా

ఈ నెల 25వ తేదీన కవిత తన కొత్త పార్టీ జెండాను మరియు ఎజెండాను ప్రకటించబోతున్నారు. ఆమె వ్యూహం ప్రకారం కాంగ్రెస్‌ను విమర్శించడం కంటే బీఆర్ఎస్ పార్టీని ఎలా కాపాడుకోవాలి అనే వ్యూహంతో ఆ పార్టీ కేడర్‌ను తన వైపుకు లాక్కోవడం ప్రధాన ఉద్దేశంగా కనబడుతోంది. తెలంగాణ రాజకీయ చదరంగంలో ఆమె వేస్తున్న ఈ రివర్స్ స్ట్రాటజీ ఖచ్చితంగా బీఆర్ఎస్ కు పెద్ద దెబ్బే అని చెప్పాలి. కేసీఆర్ ఇన్ని ఏళ్ళుగా కష్టపడి పెంచిన క్యాడర్ కనుక కవిత వైపు వెళ్తే ఇక బీఆర్ఎస్ మనుగడ కష్టమవుతుంది. ఈ విధంగా కవిత తన తండ్రిపై ఒక అద్భుతమైన పొలిటికల్ రివెంజ్ ప్లాన్ అమలు చేస్తున్నారని చర్చ జరుగుతోంది.కవిత తన పార్టీ పేరును 'తెలంగాణ జన జాగృతి' (టీజేజే) లేదా తెలంగాణ ప్రజా జాగృతి (టీపీజే) లేదా పాత సెంటిమెంట్‌ను గుర్తు చేస్తూ 'టీఆర్ఎస్' గా ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ప్రస్తుతానికి ఆమె తన ప్రధాన పోరాటం కాంగ్రెస్ పార్టీ మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైనేనని స్పష్టం చేశారు. తన తండ్రి కెసిఆర్ చుట్టూ ఉన్న కొందరు నేతల వల్లే తనకు పార్టీలో ప్రాధాన్యత తగ్గిందని, అందుకే బయటకు వచ్చి సొంతంగా బరిలోకి దిగుతున్నానని ఆమె క్యాడర్‌లో సంకేతాలిస్తున్నారు.

### పీఆర్పీ అంత పవర్ ఫులా?

చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక భారీ ప్రభావాన్ని చూపింది. కవిత పార్టీకి ప్రస్తుతానికి తెలంగాణ జాగృతి కార్యకర్తల బలం ఉంది. అయితే, ఇది పీర్పీ స్థాయిలో ఓట్ల శాతాన్ని చీల్చగలదా లేదా అనేది ఆమె ప్రకటించే అజెండాపై ఆధారపడి ఉంటుంది. ఆమె బీసీ మరియు మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రధాన అస్త్రాలుగా చేసుకుంటున్నారు. ఇది సక్సెస్ అయితే కొన్ని నియోజకవర్గాల్లో ఫలితాలను తారుమారు చేసే అవకాశం ఉంది.

### టీజేఎస్, వైఎస్సార్టీపీలా ఉంటుందా?

కోదండరాం (టీజేఎస్) లేదా షర్మిల (వైఎస్సార్ టీపీ) పార్టీలు కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం అయ్యాయి. సరైన ఓటు బ్యాంకును సృష్టించుకోలేకపోయాయి. అయితే కవితకు నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో పాత పరిచయాలు, బలమైన క్యాడర్ ఉంది.

### ఛాలెంజ్:

బిఆర్ఎస్ ఓటు బ్యాంకును ఆమె చీల్చగలిగితే అది కాంగ్రెస్‌కు లాభిస్తుందా లేక ఆమె స్వయంగా పుంజుకుంటుందా అనేది రానున్నరోజుల్లో తెలుస్తుంది.

### టీఆర్ఎస్ ను మించి..

టీఆర్ఎస్ పార్టీ 2001లో ఏర్పడగా, 2014లో అధికారంలోకి వచ్చింది. ఇంతకంటే తక్కువ కాలంలోనే కవిత సీఎం కావడం ఖాయమని, తెలంగాణ పాలిటిక్స్ రానున్న రోజుల్లో కవిత అజెండా చుట్టే తిరుగుతాయని ఆమె మద్దతుదారులు ధీమా గా చెబుతున్నారు.












# అంగన్వాడి కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే...



**రాజేంద్రనగర్, మహా ;** మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ లోని అంగన్వాడి కేంద్రంలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అన్నప్రసన్న కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఈ ఏడాది కాలంలో చదువుతోపాటు వివిధ ఆటలో సాధించిన గ్రేడ్లను తెలిపే ప్రోగ్రెస్ కార్డులను స్థానిక నాయకులు ఎస్ వెంకటేష్, శ్రీనివాస్ గుప్తా పిల్లలకు అందజేశారు. వచ్చే విద్యా సంవత్సరం ఈ పిల్లలంతా ప్రాథమిక పాఠశాలలో చేరాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ హిమ బిందు, అంగన్వాడీ టీచర్స్ అనిత, మాధవి, లక్ష్మీ, ప్రియ, రత్నం, భానుప్రియ, సంగీత, వరలక్ష్మి, గర్భిణీ మహిళలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజు కొనసాగిన ఆర్టీసీ సమ్మె

**డిపోకు పరిమితమైన ఆర్టీసీ బస్సులు**



**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు. ఆర్టిసి కార్మికుల సమ్మె రేండో రోజు గురువారం కూడా కొనసాగింది. ఆర్టిసి కార్మికులు రెండో రోజు సమ్మెలో భాగంగా ఆర్టీసీ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ డిపో ఎదుట ధర్నాకు దిగారు. ధర్నాకు మద్దతుగా ఆర్టీసీ యూనియన్ నాయకులు అశ్వర్ధామ రెడ్డి రాజేంద్రనగర్ డిపోకు చేరుకొని సంఘీభావం తెలిపారు.అశ్వర్ధామ రెడ్డి మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని 2025 వేతన సవరణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ డిపోకు సంబంధించిన ఆర్టీసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ భవనం లెట్రిన్ గోతులు రోడ్డుపైనే..?

- రోడ్డును ఆక్రమించి డ్రైనేజిని కలపడం దారుణం
- అక్రమానికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి
- నోముల మాజీ ఉపసర్పంచ్ జైపాల్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** నోముల గ్రామపంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేట్ భవనానికి సంబంధించిన లెట్రిన్ గోతులు రోడ్డు మధ్యలో తీశారని కందకట్ల జైపాల్ రెడ్డి ఆరోపించారు. రంగారెడ్డి జిల్లా మంచాల మండలం, నోముల గ్రామపంచాయతీ రెవెన్యూ పరిధి, మల్లికార్జునగూడ గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల ఎదురుగా ఉన్న రాఘవేంద్ర నగర్లో నూతనంగా నిర్మించిన ఓ భవనం యజమాని ప్రజలు తిరిగే రోడ్డులో అక్రమంగా లెట్రిన్ గోతులు తీసి భవనం నుంచి వచ్చే డ్రైనేజీని దానిలోకి కలపడం దారుణమని, భవనానికి సంబంధించి జి ప్లస్ టు అనుమతులు ఉన్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి జి ప్లస్ ఫోర్ నిర్మాణాలు నిర్మాణం చేపట్టి, ప్రైవేట్ భవనానికి సంబంధించిన ట్రాన్స్ఫారం రోడ్డుపైనే పెట్టడం ప్రజలకు వాహనదారులకు ఇబ్బందికరంగా ఏర్పడిందని, నోముల గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కందకట్ల జైపాల్ రెడ్డి ఆరోపించారు. మండల పరిషత్, గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి ఈ యొక్క అక్రమానికి పాల్పడ్డ వ్యక్తిపై తగు చర్యలు తీసుకోవాలని, ఆ యొక్క గుంతలను తొలగించి యధావిధిగా రోడ్డును నిర్మించాలని ఆయన అధికారులకు డిమాండ్ చేశారు. మండల అధికారులు స్పందించలేని పరిస్థితిలో, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని జైపాల్ రెడ్డి హెచ్చరించారు.

# త్రాగు నీటి కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..!

- వేసవిలో త్రాగు నీటి ఎద్దడి లేకుండా చూడాలి
- అధికారులను ఆదేశించిన చైర్మన్ సుదర్శన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి అధికారులకు తెలిపారు. వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ చైర్మన్ టేకుల సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని 20,24వార్డులో చైర్మన్ సుదర్శన్ రెడ్డి, మున్సిపాల్ కమిషనర్ సుదర్శన్ తో కలిసి కాలనీలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ... ఈ వేసవిలో ఎండలు తీవ్రంగా ఉండటం వల్ల ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో నీటి సమస్య తలెత్తవొద్దని, బోర్లు రిపేర్లు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, పైపులైన్ పనులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, సమస్య ఉన్న ప్రాంతాల్లో ముందస్తు ప్రణాళికతో నీటిని అందించాలని సూచించారు. నీటి సమస్య ఉన్న వార్డులలో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారానికి మున్సిపల్ అధికారులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని వార్డులల్లో అండర్ డ్రైనేజ్, వీధి లైట్ల సమస్యలను తక్షణమే తీర్చాలని, ప్రజల నుండి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఒకవేళ ఎక్కడైనా నీటి సమస్య ఉత్పన్నమైతే వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో 12, 20, 24వార్డుల కౌన్సిలర్లు మంద జయ మహేష్, గూడురు గిరి, త్రిలోక్ కుమార్, అధికారులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

# మూతికి నల్ల మాస్కులు ధరించి కార్మికుల మౌన నిరసన



**బూర్గంపహాడ్ మహా :** ఐటీసీ పీఎస్పీడీ సారపాక అడ్మిన్ బ్లాక్ వద్ద కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో ఈరోజు కార్మికులు వినూత్న నిరసన కార్యక్రమం నిర్వహించారు. మూతికి నల్ల మాస్కులు ధరించి మౌన ప్రదర్శన చేపట్టి తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.కార్మికులు తెలిపిన వివరాల ప్రకారం, 13వ వేతన ఒప్పందంలో ఉన్న పెండింగ్ సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాకపోవడం, అలాగే 14వ వేతన ఒప్పందం జాప్యం కావడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. కార్మికులకు రూ.22,000 ప్యాకేజీ వేతనం అమలు చేయాలని, 100 శాతం అన్లిమిటెడ్ మెడికల్ సదుపాయాలు కల్పించాలని, పర్మినెంట్ మరియు కాంట్రాక్ట్ కార్మికులకు సముచిత వేతనాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా కార్మిక జేఏసీ కన్వీనర్ సానికొమ్ము శంకర్ రెడ్డి మాట్లాడుతూ, గుర్తింపు సంఘం యూనియన్ మరియు మేనేజ్మెంట్ కార్మికులకు అనుకూలంగా వెంటనే వేతన ఒప్పందం చేయాలని కోరారు. లేనిపక్షంలో కార్మిక జేఏసీ తీసుకునే తదుపరి నిర్ణయాలకు మేనేజ్మెంట్ మరియు యూనియన్ పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.రాబోయే రోజుల్లో కార్మికుల ఆందోళనలు మరింత ఉధృతం చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. కార్మికుల ప్రయోజనాల కోసం అవసరమైతే జేఏసీతో కలిసి ముందుకు రావాలని గుర్తింపు సంఘాన్ని కూడా సూచించారు.

# సారపాకలో అంగన్వాడీలకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ

84 కేంద్రాలకు డిజిటల్ బలోపేతం – సేవలు మరింత పారదర్శకం

అభివృద్ధి దిశగా బూర్గంపాడు మండలం – ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం సారపాకలోని వాసవి ఫంక్షన్ హాల్లో అంగన్వాడీ ఉపాధ్యాయులకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు.మండల పరిధిలోని 84 అంగన్వాడీ కేంద్రాల ఉపాధ్యాయులకు స్మార్ట్ ఫోన్లు అందజేయడం ద్వారా ప్రభుత్వ సేవలు వేగంగా ప్రజలకు చేరుతాయని ఎమ్మెల్యే తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల్లో డిజిటల్ సాంకేతికత వినియోగం పెరగడం వల్ల చిన్నారులు, గర్భిణీ స్త్రీలకు అందే సేవలు మరింత పారదర్శకంగా మారుతాయని పేర్కొన్నారు.అలాగే అన్ని అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలిపారు. మండలంలో ఇప్పటికే పలు అంగన్వాడీ భవనాలు నిర్మించామని, త్వరలోనే ITC Limited సిఎస్ఆర్ నిధులతో సారపాకలో మరో నాలుగు అంగన్వాడీ భవనాల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమం సిడిపిఓ రేవతి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, పంచాయతీరాజ్ శాఖ అధికారి టీ వెంకటేశ్వర్లు, విద్యుత్ శాఖ సహాయ ఇంజనీర్ ఉపేందర్, గృహనిర్మాణ శాఖ సహాయ ఇంజనీర్ ఉదయ్ కిరణ్, సారపాక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్, కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా కన్వీనర్ భజన సతీష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ కన్వీనర్ మహమూద్ ఖాన్, జిల్లా కార్యదర్శి వారాల వేణు, ఉప సర్పంచ్ కన్నదారి రమేష్, సర్పంచులు మంద నాగరాజు, మంగమ్మ, పోతునూరి సూరమ్మ, మాజీ ఉప సర్పంచ్ పోతిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్, మాజీ మండల అధ్యక్షుడు పూలపల్లి సుధాకర్ రెడ్డి, నాయకులు ఇంగువ రమేష్, ఎడమకంటి సుధాకర్ రెడ్డి (యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు), భజన ప్రసాద్ (సోషల్ మీడియా సమన్వయకర్త), దుణుకు రాము, ఎడమకంటి పిచ్చిరెడ్డి (గ్రామ అధ్యక్షుడు), తిరుపతి చంటి, కాటం వెంకట్రామిరెడ్డి, దుగ్గెంపూడి సుశాంత్ రెడ్డి (మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు) తదితరులు పాల్గొన్నారు. అంగన్వాడీ పర్యవేక్షకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## వాసవి మాత జయంతి అధికార ప్రకటన పట్ల హర్షం వ్యక్తం చేసిన పెండ్యాల



**జూలూరుపాడు, మహా:** ఆర్యవైశ్య కుల దైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాల్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడం, వెంటనే జీవో విడుదల చేయటం పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఆర్యవైశ్య మహాసభ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ పక్షాన జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ మాజీ కార్యవర్గ సభ్యులు పెండ్యాల విజయ భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వాసవి మాత జయంతిని ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించేందుకు కలెక్టర్లు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. దీంతో గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు ఉత్సవాలు మరింత వైభవంగా జరగనున్నాయి.

# నేటి నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు

**జూన్ 12న పునఃప్రారంభం**

**జూలూరుపాడు, మహా:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి సెలవులను పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈనెల 24 నుంచి అమలు చేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. జూన్ 12న పునఃప్రారంభించాలని స్పష్టం చేసింది. విద్యా సంవత్సర కేలండర్ ప్రకారం ఈ సెలవులను ప్రకటించింది. విద్యా సంవత్సరం చివరి రోజులోగా అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు భద్రతా చర్యలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించింది. మధ్యాహ్నం 12 గంటలు నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో బయట తిరగకూడదని విద్యార్థులకు వివరించాలని తెలిపింది. పాఠశాల నోటీసు బోర్డులపై భద్రతా నియమాలను ప్రదర్శించాలని, తల్లిదండ్రులను అప్రమత్తం చేస్తూ పిల్లలపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూడాలని ఆదేశించింది.

# మణుగూరులో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు.. బీఆర్ఎస్ సంఘీభావం..

**హామీలు వెంటనే అమలు చేయాలని హెచ్చరిక..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఆర్టీసీ కార్మికుల న్యాయమైన పోరాటానికి బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది.జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు మణుగూరులో ఆర్టీసీ కార్మికులకు సంఘీభావంగా గురువారం మద్దతు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆర్టీసీ కార్మికుల ప్రధాన డిమాండ్లు అయిన పెండింగ్ బకాయిల చెల్లింపు, జీతాల సవరణ, ఉద్యోగ భద్రత, ఖాళీ పోస్టుల భర్తీ, పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రావలసిన ప్రయోజనాల మంజూరు, కార్మిక సంక్షేమ పథకాల అమలు, విధుల్లో భద్రతా చర్యలు వంటి అంశాలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఎన్నికల ముందు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికులను విస్మరించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి అలవాటైందని విమర్శించారు. తెలంగాణ సాధనలో కీలక పాత్ర పోషించిన కార్మిక వర్గాన్ని ఇబ్బందులకు గురిచేస్తే బిఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కురి నాగేశ్వరరావు, టౌన్ అధ్యక్షుడు కుంట లక్ష్మణ్, మాజీ జెడ్పీటీసీలు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపిన వారిలో ఉన్నారు.

# విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

**రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి స్పష్టం..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం లంకమల్లారం గ్రామంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. భద్రాచలం ఐటీడీఏ పరిధిలో బీటీ రహదారి పనులకు శంకుస్థాపన చేసి, టీటీఆర్జేసీ బాలికల డార్మెటరీ హాల్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి చేరేలా ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. ఇటీవల రూ.2.70 కోట్ల వ్యయంతో బాలికల వసతి గృహాన్ని ప్రారంభించామని, పేద విద్యార్థులు కూడా ధనికుల పిల్లలతో సమానంగా చదువుకునేలా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు.హాస్టళ్లలో నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందిస్తూ విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు. నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ప్రతి నియోజకవర్గంలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. వైద్య రంగంలో కూడా ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేసి పేదలకు నాణ్యమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పినపాక నియోజకవర్గ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు నిర్మాణంలో ఉన్నాయని, ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నెరవేర్చుతున్నామని చెప్పారు. నియోజకవర్గంలో 380 గ్రామాలకు సుమారు 4500 ఇళ్లను ఆమోదించామని తెలిపారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ పోషకాహారం అందిస్తున్నామని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక, 99 రోజుల కార్యాచరణలో భాగంగా పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల్లో సమ్మర్ క్లాసులు నిర్వహించి విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెప్పారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను వినియోగించుకుని చదువుపై దృష్టి పెట్టాలని సూచించారు. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రాహుల్ మాట్లాడుతూ ఈ విద్యాసంస్థలో 584 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, కొత్త డార్మెటరీ ద్వారా సుమారు 600 మందికి వసతి కల్పించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, గ్రామ సర్పంచ్ పూనెం రమేష్, పాఠశాల ప్రిన్సిపాల్ రాణి, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపిన చర్ల బిఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు కో కన్వీనర్ ఐనవోలు పవన్ కుమార్ గార్లు



**చర్ల మహా:** ఈ సందర్భంగా దొడ్డి తాతారావు గారు మాట్లాడుతూ, 2023 ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చి మర్చిపోయింది కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని తీవ్రంగా విమర్శించారు. కార్మికుల కష్టాలను అర్థం చేసుకోకుండా ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని, వెంటనే చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు ఆర్టీసీ కార్మికులు అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు.కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ ఎంతకాలం కార్మికులను మభ్యపెడుతారని ప్రశ్నించారు.రాష్ట్ర సాధనలో అగ్రభాగాన ఉన్న ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని విమర్శించారు.ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడానికి ఈ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని అన్నారు.మండే ఎండల్లో తమ డిమాండ్ల నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన తెలిపే కార్మికుల స్వేచ్ఛ హక్కులను కూడా ఈ ప్రభుత్వం కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు.నీడ కోసం టెంట్లు కూడా వేసుకొనివ్వకుండా పోలీసులు ఆపడం దారుణమన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను,సమస్యలను పరిష్కరించాలని లేని ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతారు ఈరోజు నుండి విద్యార్థులకు పాఠశాల సెలవులు గురుకుల పాఠశాల నుండి ఇంటికి వచ్చే విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతారు ప్రజలను కార్మికులకుల బాధలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలని లేని ఎడల ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు.

## సైబర్ క్రైమ్ డ్రగ్స్ నార్కోటిక్స్ పై

# అవగాహన తప్పనిసరి



- ఆదిభట్ల సర్కిల్ ఇన్ స్పెక్టర్ బి రవికుమార్
- ఫాక్స్ కాన్ కంపెనీ డ్రైవర్లకు అవగాహన

కొంగరకలాన్లోని ఫాక్స్ కాన్ కంపెనీలో అరేయ్ అలైవ్, సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమాన్ని సిఐ రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదిభట్ల పోలీసులు ఎస్ఐ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ రాధా కిషన్, కానిస్టేబుల్ శివాజీ పద్మజలు, ఫాక్స్ కాన్ డ్రైవర్లకు 'అరైవ్ అలైవ్' ద్వారా, సైబర్ క్రైమ్, డ్రగ్స్ నార్కోటిక్స్ పై అవగాహన కల్పించారు. ప్రతి రోజూ వాహనం పరిస్థితిని తనిఖీ చేయడం, రక్షణాత్మక డ్రైవింగ్ ప్రతి ఒక్కరి బాధ్యత, రోడ్డు ప్రమాదాల నివారణ ప్రాణ రక్షణకు ప్రాధాన్యత, సురక్షితంగా డ్రైవ్ చేయండిఅరైవ్ అలైవ్, ప్రమాదాల తర్వాత ప్రాణాలను కాపాడటంలో గోల్డెన్ అవర్ యొక్క ప్రాముఖ్యత గురించి సిఐ రవికుమార్ వివరించారు. అలాగే మోసగాళ్ల చేతిలో ప్రజలు ఎంత సులభంగా మోసపోతున్నారో తెలియజేస్తూ, గోల్డెన్ అవర్లో సైబర్ క్రైమ్ పోలీస్/హెల్ప్లైన్ 1930ని సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆరోగ్యం మరియు జీవితంపై డ్రగ్స్ యొక్క హానికరమైన ప్రభావాల గురించి తెలుసుకోవాలని, డ్రగ్స్కు దూరంగా ఉండండి, ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ, వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ తలపు పెట్టుకోవాలని సూచిస్తూ, మద్యం సేవించి వాహనం నడపవద్దని తెలియజేశారు. ప్రతి ప్రయాణం సురక్షితంగా ముగిసేలా చూసుకుందాం, అప్రమత్తంగా ఉందాం, జీవితానికి విలువ ఇద్దాంఅందువల్ల మీరు సంతోషంగా ఇంటికి చేరుకోవడమే మా ముఖ్య ఉద్దేశమని సిఐ అన్నారు.



**ఈదురు గాలులతో కురిసిన వర్షా నికి**

# గోడలు కూలాయి

**రేకులు ఎగిరిపోయాయి..**

**రాజేంద్రనగర్, మహా ;** శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో గురువారం ఈదురుగాలులతో కురిసిన వర్షానికి రేకులు లేచిపోయాయి, గోడలు కూలిపోయి. గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్, ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్ పల్లి నరేందర్ తో కలిసి బాధిత కుటుంబాని పరామర్శించి వారికి మనోధైర్యాన్ని ఇస్తూ, సాధ్యమైనంత త్వరగా ఇళ్లు నిర్మాణం చేపటిస్తామన్నారు.




## ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి :సర్పంచ్ తాటివాని

**ఉపాధి కూలీలకు మెడికల్ కిట్లు మంచినీరు అందజేత**

**బూర్గంపహాడ్ మహా :** ఉపాధి కూలీలు వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కృష్ణసాగర్ సర్పంచ్ తాటి వాణి అన్నారు. కృష్ణసాగర్ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశాన్ని గురువారం ఆమె ఉప సర్పంచ్ మోహన్, కార్యదర్శి నాగిరెడ్డి లతో కలిసి సందర్శించారు. కూలీలకు మంచినీరు, మెడికల్ కిట్లు అందజేశారు. వడదెబ్బ తగలకుండా తరచూ మంచినీరు తాగాలని, డిహైడ్రేషన్ ప్రభావం పడకుండా జాగ్రత్త వహించాలి అని ఆమె అన్నారు. ఉపాధి పనుల ను గ్రామంలో ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని కోరారు. ఉపాధి కూలీల కు ప్రభుత్వం 45 రోజుల్లో మహిళలకు సంక్షేమ పథకాలు అందించనున్నదని ఆమె అన్నారు.అనంతరం గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీలను సందర్శించారు. నర్సరీలో మొక్కలకు సరిపడా నీరు అందించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ఎస్టీ కాలనీ లో ఉన్న ఎంపీపీ ఎస్ పాఠశాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు రాజేష్ అంతోటి కృష్ణలీల, సురేష్, మడకం దేవయ్య ,ఫీల్డ్ అసిస్టెంట్ హనుమంతరావు గ్రామస్తులు ,తదితరులు పాల్గొన్నారు.



# హైదరాబాద్ వాస్తవ్యుడి భక్తి కానుక

**స్వామివారికి రూ.30 లక్షల బంగారు ఆభరణాల విరాళం**

**బూర్గంపహాడ్ మహా :** సికింద్రాబాద్, సీతారాం నగర్కు చెందిన హైదరాబాద్ వాస్తవ్యుడు శ్రీ ఆదిత్య గారు భక్తి భావంతో భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారికి సుమారు రూ.30,00,000 విలువ గల మూడు బంగారు ఆభరణాలను విరాళంగా సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, భక్తులు శ్రీ ఆదిత్య గారి దాతృత్వాన్ని అభినందించారు. స్వామివారి పట్ల ఆయనకు ఉన్న అపార భక్తిని ఈ విరాళం ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ఈ మహత్తర దానం ద్వారా ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందడంతో పాటు ఇతర భక్తులకు కూడా స్ఫూర్తిగా నిలుస్తుందని ఆలయ వర్గాలు వెల్లడించాయి

# కాళేశ్వరం పై కాంగ్రెస్ చేసిన ఆరోపణలు త్రిప్పికొట్టిన హైకోర్టు తీర్పు

- ప్రతిపక్షాలపై బురదజల్లే యత్నం మానుకోవాలని బిఆర్ఎస్ హితవు
- హైకోర్టు తీర్పు అనుకూలంగా రావడంతో బిఆర్ఎస్ సంబురాలు



**దమ్మపేట, మహా :** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీగా అవకతవకలు ,అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలను హైకోర్టు త్రిప్పి కొడుతూ ఇచ్చిన తీర్పుపై బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని బి ఆర్ ఎస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ,పార్టీ ఇంచార్జి మెచ్చా నాగేశ్వరరావు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా మెచ్చా మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ పై హైకోర్ట్ ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ ప్రభుత్వానికి చెంప పెట్టన్నారు. ఇప్పటికైనా అధికార ప్రభుత్వం ,ప్రతిపక్షాలపై బురదజల్లే ప్రయత్నం మానుకోవాలని హితవుపలికారు. ప్రజాపాలనపై దృష్టి సారించి ,ప్రజలకు కనీసం ఈ రెండేళ్ల పాటైనా సక్రమంగా సేవలు అందించాలని కోరారు. కేసీఆర్ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశారని, కాంగ్రెస్ ప్రభుత్వంలో రాబందుల్లా రాష్ట్రాన్ని దోచుకోవడమే రేవంత్ టీమ్ లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు.కాళేశ్వరం ప్రాజెక్టు పై హైకోర్టు ఇచ్చిన తీర్పుతో కాంగ్రెస్ కుట్రలు బట్టబయలు అయ్యాయనీ, సంతోషం వెలిబుచ్చారు. తెలంగాణ రైతుల నమ్మకానికి, ప్రాజెక్ట్ కోసం కష్టపడ్డ ఇంజినీర్ల శ్రమకు, కెసిఆర్ నమ్మకానికి ఇది దక్కిన గౌరవం ఈ తీర్పని అన్నారు. ప్రజల దృష్టిని మళ్ళించడానికే కాంగ్రెస్ పాలకులు బి ఆర్ ఎస్ నాయకుల మీద బురద జల్లుతున్నారన్నారు. రేవంత్ రెడ్డి 420 హామీలు ఇచ్చి, ఇచ్చిన హామీలు అమలు చేయడం చేత కాక పొద్దున లేస్తే కేసీఆర్ పై విమర్శలే పనిగా పెట్టుకున్నాడన్నారు. ఒక ముఖ్యమంత్రికి ఉండాల్సిన లక్షణాల్లో ఏ ఒక్క లక్షణం కూడా రేవంత్ లో లేవనీ, పరిపాలన చేతకాకపోతే రాజీనామా చేసి ఇంట్లో కూర్చోవాలనీ, తెలంగాణకు కల్పతరువు అయిన కాళేశ్వరం ప్రాజెక్ట్ ను రెండేళ్లుగా నిరుపయోగంగా ఉంచినందుకు ప్రజలకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలన్నారు. రాజ్యాంగం, చట్టాలకు విరుద్ధంగా ఎవరు వ్యవహరించినా న్యాయవ్యవస్థ చూస్తూ ఊరుకోదన్నారు. చట్టం తనపని తాను చేసుకుపోతుందని ,చట్టం ఎవరికీ చుట్టం కాదన్నారు. ఆర్ టి సి కార్మికుల డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాల్సిందేనని, మా పూర్తి మద్దతు ఆర్ టి సి కార్మికులకు ఉంటుందని తెలిపారు. మరో రెండేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం పక్కా వస్తుందనీ, అప్పుడు మీ లెక్కలు తప్పక సరిచేస్తామన్నారు. ప్రజలు ఆలోచనలో పడ్డారనీ, నమ్మించి గొంతుకోసిన కాంగ్రెస్ కి ఓటు అనే ఆయుధంతోనే బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

**కెసిఆర్ కు పెళ్ళిరోజు సందర్భంగా :**

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు నాయకులతో కలిసి కేక్ కట్ చేసి నియోజకవర్గ ప్రజల తరుపున కెసిఆర్ దంపతులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ రమేష్, పార్కలగండి సర్పంచ్ కొమరం సుశీల, మాజీ ఉప సర్పంచ్ దారా యుగంధర్, గాజుబోయిన ఏసుబాబు, అబ్దుల్ జిన్నా, బుడే, నియోజకవర్గ యువజన విభాగ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాస్ రావు, వార్డ్ మెంబర్లు దారా రాము, గోళ్ళ భవనీ కృష్ణ యాదవ్, రూపా రాంబాబు, కౌలూరి నాగయ్య, మండల బి ఆర్ ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మండవ సత్య, కాసిని శ్రీను, మద్దెల పుల్లారావు, వెలుగోటి మహేష్, దండాబత్తుల కాంతారావు, శేషాద్రి, ధర్మ, పోలారావు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సమాజ శ్రేయస్సు కోసం పనిచేస్తాం

**బహుజన పాస్టర్స్ కమిటి హామి**



**దమ్మపేట ,మహా :** మండలంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు , అవినీతి రహిత ,మత్తుపదార్ధ రహిత మండలంగా తీర్చిదిద్దాలనే పోలీస్ వారి సంకల్పానికి తోడుగా బహుజన పాస్టర్స్ కమిటీ బాసటగా నిలుస్తుందని గురువారం హామీ ఇచ్చారు. ఈ మేరకు స్థానిక పోలీస్ ఎసై.సాయికిషోర్ రెడ్డిని కలిసి ప్రత్యేకంగా శాలువా తో అభినందించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ,గుట్కా,గంజాయి వంటి మత్తు పదార్ధాల నివారణకు కృషి చేసి ,ఇటీవల కాలంలో భద్రాద్రి జిల్లా ఎస్పీ చేత ప్రశంసలు పొందిన ఎసై కు కమిటీ అభినందనలు తెలిపారు. మండలంలో శాంతిభద్రతల పెంపుకు ,అరైవ్ అలైవ్ కార్యక్రమంలో హెల్మెట్ లు పంపిణీకి తమ వంతు సహకారం పాస్టర్ ల కమిటీ ద్వారా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సెబాస్టియన్, ఉపాధ్యక్షులు యేసు రత్నం, సెక్రటరీ క్రాంతి కుమార్, జాయింట్ సెక్రటరీ జకర్యా, కమిటీ పెద్దలు నిరీక్షణరావు, దైవప్రసాద్, రవిబాబు, జాన్ బాబు, రమేష్ జాషువా, శ్యాంబాబు, తిమోతి, ప్రసాద్, ఇశ్రాయేలు, జోషెప్, లారెన్స్, అర్జున్ తదితర పాస్టర్స్ పాల్గొన్నారు.



# కేజీబీవీ పాఠశాలలో డిఇఓ నాగలక్ష్మి ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులకు ప్రగతి పత్రాల పంపిణీ
- ఎంపీపీ ఎస్ పాఠశాలలో పేరెంట్స్ ఉపాధ్యాయులతో సమావేశం

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల ను జిల్లా విద్యాశాఖ అధికారి బి నాగలక్ష్మి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల చివరి పని దినం కావడంతో విద్యార్థులు తమ తల్లిదండ్రులతో పాఠశాలకు హాజరయ్యారు. విద్యార్థులకు ప్రగతి పత్రాలను అందజేశారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులను, ప్రయోగశాలను కంప్యూటర్ ల్యాబ్, వంట గది, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం బిపిఎస్ పాఠశాలను సందర్శించారు పాఠశాలలో పేరెంట్స్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యా సంవత్సరంలో విద్యార్థుల ప్రగతి మంత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి ఎదుర సింహరాజు, ప్రధానోపాధ్యాయులు శేషగిరిరావు, ఎస్ ఓ సుశీల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మిర్చిపంట కాలిన రైతును ఆదుకోవాలి - సీపీఐ(ఎం)



**కారేపల్లి, మహా :** కల్లంలో అగ్గికి మిర్చిపంట ఆహుతైన బాధిత రైతు అజ్మీర శ్రీనివాస్ ను ఆదుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం బాధిత రైతు మిర్చి కల్లాన్ని సీపీఐ(ఎం) బ□ందం పరిశీలించారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ బాధిత రైతు అజ్మీర శ్రీనివాస్ కౌలుకు తీసుకోని సాగు చేసిన భూమిలో మిర్చి పంట వేసి కోసిన 14 క్వింటాళ్ల మిర్చిని కల్లం ఆరబోయగా అది కాలిపోవటం విచారకరమన్నారు. ఆరుగాలం కష్టపడిన రైతు కష్టం అగ్గికి ఆహుతికావటంతో రూ.4 లక్షల నష్టం వాటిల్లిందన్నారు. దీనికి సంబంధించి పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారన్నారు. దిక్కుతోని స్థితిలో ఉన్న గిరిజన రైతు శ్రీనివాస్‌ను ధైర్యం చెప్పిన సీపీఐ(ఎం) నాయకులు బాధిత రైతును ఆదుకోవాలని హార్టికల్చర్, వ్యవసాయశాఖ అధికారుల ద□ష్టికి తీసుకవెళ్ళారు. వెంటనే అగ్నిని ఆహుతైన పంటను పరిశీలించి ప్రభుత్వం ద□ష్టితీసుకెళ్ళాలని కోరారు. పంటను పరిశీలించిన వారిలో సీపీఐ(ఎం) నాయకులు పండగ కొండయ్య, కల్తి రామచంద్రు, పోతర్ల నాగేశ్వరరావు, కరపటి సీతారాములు, దారావత్ వస్రాం, కుర్సం శ్రీను, భూక్య రమేష్, సొసైటీ డైరక్టర్ కొత్తూరి రామారావులు ఉన్నారు.



# కాప్రాలో బిఎంఎస్ ప్రైవేట్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

**2007 తర్వాత నూతన కార్యవర్గం ఏర్పాటు**

**కుషాయిగూడ, మహా :** కాప్రా సర్కిల్ పరిధిలోని ప్రైవేట్ ఉద్యోగుల నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బిఎంఎస్ ఆల్ ఇండియా భాగ్యనగర్ విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో భాగ్యనగర్ మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టి. కృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, సలహాదారులు భిక్షపతి, నరేష్ లు ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా బి. రాజ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎస్. అబ్దుల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎ. యాదగిరి ఎన్నికయ్యారు. అడిషనల్ సెక్రటరీగా బాబు, కోశాధికారిగా ఎల్లయ్యలు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ.. కాప్రా సర్కిల్ పరిధిలో 2007 నుండి ప్రైవేట్ ఉద్యోగులకు సరైన యూనియన్ లేకపోవడం వల్ల అనేక సమస్యలు పేరుకుపోయాయన్నారు.

# క్షయ వ్యాధిగ్రస్తులకు కిట్లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**యాదగిరిగుట్ట, మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో క్షయ వ్యాధి గస్తులకు మిత్ర పథకం ద్వారా పోషకాహర కిట్లను ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం పంపిణీ చేశారు.ఈకిట్లలో,బియ్యం ,పప్పులు,వేరుశనగలు,వంట నూనె చిరుధాన్యాలు,ఉంటాయి ఇవి రోగులకు రోగనిరోధక శక్తి పెంచి 6నెలల చికిత్స సమయంలో త్వరగా కోలుకోవడానికిసహాయపడుతాయని పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య అధికారితో పాటు డాక్టర్లు,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కుర్మ సంఘం భవన నిర్మాణానికి భూమిపూజ

**ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**



**యాదగిరిగుట్ట, మహా:** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లిలో కురుమ సంఘం నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య గురువారం భూమిపూజ చేశారుఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, కురుమ సంఘం అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందని తెలిపారు.సంఘ భవనం నిర్మాణం ద్వారా కురుమ సమాజానికి ఒక స్థిరమైన వేదిక లభిస్తుందని, సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సంఘ భవనాలు సమాజ ఐక్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు.ఈ భవన నిర్మాణం పూర్తయిన తర్వాత గ్రామ ప్రజలకు సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించడానికి సౌకర్యవంతమైన వేదిక అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

# కారేపల్లి పోస్టు ఆఫీస్‌లో చోరీకి యత్నం



**కారేపల్లి, మహా:** కారేపల్లి పోస్టు ఆఫీస్‌లో బుధవారం రాత్రి దొంగలు చోరికి యత్నించారు. కారేపల్లి శివాలయం వీధిలో ఉన్న పోస్టు ఆఫీస్ తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు పోస్టు ఆఫీస్‌లోని క్యాష్ చెస్ట్(లాకర్)ను ఓపెన్ చేయటానికి ప్రయత్నం చేశారు. అది విఫలమైంది, కార్యాలయంలోని బీరువాలను తెరిచి నగదు కోసం వెతికి ఆనవాళ్లు కనిపించాయి. ఉదయం పోస్టుఆఫీస్‌కు వచ్చిన సిబ్బందికి కార్యాలయ ముందు తలుపుకు ఉన్న తాళ్ల పగులగొట్టి ఉండటం చూసి సబ్ పోస్టు మాస్టర్ కే.ప్రశాంత్‌కు విషయం తెల్పి పోలీసులకు కబురు చేశారు. క్యాష్ చెస్ట్‌లో రూ.40వేలు ఉన్నాయని, వాటికి ఎలాంటి నష్టం జరగలేదని ఎస్‌పీఎం ప్రశాంత్ తెలిపారు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. దీనికి సంబంధించి సబ్ పోస్ట్‌మాస్టర్ ప్రశాంత్ కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు.



# విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి

**ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. విద్యా సంవత్సరం ఆఖరి రోజు కావడంతో గురువారం నిమ్మల గూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రగతి నివేదికలను అందజేశారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులను ఉద్దేశించి ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేటట్లుగా పిల్లల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎండలో ఏ మాత్రం తిరగనీయకుండా వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించి ఎక్కువగా మజ్జిగ నిమ్మరసం తాగించాలని అదేవిధంగా వేసవి సెలవుల్లో విద్యార్థులు గణితములలో బాగా శ్రద్ధ వహించి చదవాలని స్టోరీ టెల్లింగ్ డ్రాయింగ్ లాంటి వాటిలో నైపుణ్యం సంపాదించాలని ఐదు సంవత్సరాలు నిండిన బడి ఈడు పిల్లలను ఐదవ తరగతి పూర్తయిన విద్యార్థులను అన్ని సౌకర్యాలు కలిగి యున్న ప్రభుత్వ బడులలోనే చేర్పించి ప్రభుత్వ బడులను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ప్రధానోపాధ్యాయులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సహ ఉపాధ్యాయులు ఎండి షఫీ అహ్మద్, పాఠశాల సిబ్బంది లావణ్య, రజిత, నరేష్‌లతోపాటు తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించాలి



**యాదాద్రి భువనగిరి, మహా:** తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశాలు నిర్వహించడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రగతి, ప్రవర్తన, హాజరు, ప్రతిభ వంటి అంశాలపై తల్లిదండ్రులతో సమగ్రంగా చర్చించగలమని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు.గురువారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భువనగిరిలో సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ను అదనపు కలెక్టర్ సందర్శించారు.తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు సమావేశా లు నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా ప్రగతి, ప్రవర్తన, హాజరు, ప్రతిభ వంటి అంశాలపై తల్లిదండ్రులతో మాట్లాడుకోవచ్చు అని అన్నారు. విద్యార్థి బలాలు, బలహీనతలను గుర్తించి, వాటిని మెరుగుపరచేందుకు తగిన సూచనలు అందించడం జరుగుతుందని తెలిపారు.తల్లిదండ్రులు తమ పిల్లల అభ్యాసంపై ఉపాధ్యాయులతో నేరుగా మాట్లాడే అవకాశం ఉంటుందని అన్నారు. పిల్లల అభ్యాసంలో ఉన్న సమస్యలను త్వరగా గుర్తించి పరిష్కరించవచ్చున్నారు. ఉపాధ్యాయులు కూడా తల్లిదండ్రుల అభిప్రాయాలను వినడం ద్వారా విద్యార్థి వ్యక్తిగత పరిస్థితులను అర్థం చేసుకుని, బోధన విధానాల్లో అవసరమైన మార్పులు చేయగలరు. ఈ పరస్పర సంబంధం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, చదువుపై ఆసక్తిని పెరుగుతుందన్నారు.. ప్రతిభావంతులైన విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించడంతో పాటు విద్యార్థులకు ప్రగతి నివేదన పత్రాలను అందజేసిన అదనపు కలెక్టర్ భాస్కర్ రావు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# ఆర్టీసీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- సమ్మెకు ఏఐఎఫ్‌టీయూ, రైతు కూలీ సంఘం మద్దతు
- విలీన ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్



**కుషాయిగూడ, మహా :** రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య, రైతు కూలీ సంఘం తెలంగాణ రాష్ట్ర కమిటీలు డిమాండ్ చేశాయి. కార్మికులు చేపట్టిన సమ్మెకు ఈ సంఘాలు తమ పూర్తి మద్దతును ప్రకటించాయి. ఈ మేరకు గురువారం కుషాయిగూడలో ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించి ఆందోళనలో పాల్గొన్నారు. ఆయా సంఘాల రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ కమిటీల పేరుతో కాలయాపన వద్దని, కార్మికులు 41 రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చినప్పుడు స్పందించని ప్రభుత్వం, ఇప్పుడు ఆఫీసర్స్ కమిటీ వేయడం కాలయాపన చేయడమేనని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే కార్మికుల్లో నమ్మకాన్ని కల్పించాలని కోరారు. ఆర్టీసీని ప్రభుత్వ రంగ సంస్థగా ప్రకటించి, విలీన ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, వేతన సవరణ , రిటైర్డ్ ఉద్యోగుల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం చేపట్టిన ఎలక్ట్రిక్ బస్సుల పెంపును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ల భాగస్వామ్యంతో ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా, ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలైన టి ఎన్ జి ఓ , టీజీవోలు కూడా ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలపాలని కోరారు. ప్రజలకు రవాణా ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని వారు విజ్ఞప్తి చేశారు. సమ్మెలో పాల్గొన్న ఏఐఎఫ్ టి యు ఎర్రెల్లి. మల్లేష్, గొల్ల అంజయ్య, పట్లోళ్ల నాగిరెడ్డి, వెల్తురు సదానందం తదితరులు ఉన్నారు.

# భగీరథ మహర్షి జయంతి వేడుకలు



**యాదాద్రి భువనగిరి, మహా:** భగీరథ మహర్షి పట్టుదలకు ప్రతీక అని , త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు అన్నారు. గురువారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి తో జ్యోతి ప్రజ్వలన గావించి, మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ మహర్షి గంగా నదిని స్వర్గం నుంచి భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి అని కొనియాడారు. అనంతరం అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి, నివాళులు సమర్పించారు.ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి సాహితీ , ఫుడ్ సేఫ్టీ అధికారి స్వాతి,కుల సంఘాల నాయకులు, పెద్దలు,తదితరులు పాల్గొన్నారు.

# రెండో రోజుకు ఆర్టీసీ సమ్మె..

- మణుగూరులో 8 మంది కార్మికులు అరెస్ట్..
- నర్సంపేటలో ఆత్మహత్యాయత్నం..
- ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన.. ధర్నా..




**మణుగూరు, మహా :** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆర్టీసీ సమ్మె రెండో రోజుకు చేరుకుంది. సమ్మె నేపథ్యంలో గురువారం మణుగూరు డిపోలో పోలీసులు 8 మంది ఆర్టీసీ కార్మికులను అరెస్ట్ చేశారు. ఇదే సమయంలో నర్సంపేట, భద్రాచలం ప్రాంతాలకు చెందిన ఇద్దరు కార్మికులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటనలు ఉద్రిక్తతకు దారితీశాయి. ఈ ఘటనలపై కార్మిక సంఘాలు నిరసనలు చేపట్టాయి. మణుగూరు డిపో ఎదుట ఆర్టీసీ కార్మిక జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. అరెస్టులతో, నిర్బంధాలతో ఆందోళనలను ఆపలేరని వెంటనే సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్షణ ధోరణిని వీడాలని అన్నారు. భద్రాచలం నర్సంపేట, డిపోలకు చెందిన కార్మికులకు జరగరానిది ఏమైనా జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని జేఏసీ ఈ సందర్భంగా డిమాండ్ చేసింది.

**ఆర్టీసీ సమ్మెకు టియుసిఐ మద్దతు..**

న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ఆర్టీసీ కార్మికులు చేపడుతున్న సమ్మెకు సంపూర్ణ మద్దతును ఇస్తున్నట్లు ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షులు ఆర్ మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించకుండా నిర్బంధం ద్వారా సమ్మెను విచ్ఛిన్నం చేయాలని చూడడం దుర్మార్గమని ఆయన అన్నారు. నర్సంపేట డిపోలో జరిగిన ఆత్మహత్యాయత్నానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ఆత్మహత్యల వంటి చర్యలకు కార్మికులు దూరంగా ఉండాలని, ధైర్యంగా పోరాడి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఆర్టీసీ కార్మికులు అనవసరమైన డిమాండ్లు చేయడం లేదని, ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలే కోరుతున్నారని తెలిపారు. కార్మిక సంఘాల జేఏసీ పలుమార్లు ప్రభుత్వ దృష్టికి సమస్యలను తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతోనే సమ్మె అనివార్యమైందన్నారు.ఈ సమ్మె కారణంగా ప్రజలకు కలుగుతున్న ఇబ్బందులకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని పేర్కొన్నారు. డ్రైవర్లు సమ్మెకు మద్దతుగా నిలవాలని, ప్రత్యామ్నాయంగా బస్సులు నడపడం ద్వారా కార్మికుల పోరాటాన్ని దెబ్బతీయవద్దని సూచించారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో పి సంజీవరెడ్డి, వి జానయ్య, మిట్టపల్లి రాజేందర్, సతీష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

**ప్రయాణికులకు అసౌకర్యం సర్వీసులు..**

ఆర్టీసీలో ప్రయాణించే ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మణుగూరు డిపో నుంచి 52 బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు మణుగూరు ఆర్టీసీ డిఎం శ్యామ్ పేర్కొన్నారు.



# పుస్తకాలు మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దుతాయి

**పసుపులేటి వీరబాబు**

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** పుస్తకాలు మనిషిని మహోన్నతునిగా తీర్చిదిద్దుతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు అన్నారు. పుస్తక దినోత్సవం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తకాలు మనిషి జీవితాన్ని మార్చగల శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. పఠనం ద్వారా జ్ఞానం పెరుగుతుందని సమాజంలో అవగాహన చైతన్యం కలుగుతాయని ఆయన అన్నారు. ముఖ్యంగా యువత రోజుకు కనీసం ఒక గంట అయినా పుస్తక పఠనానికి కేటాయించాలని సూచించారు. డిజిటల్ యుగంలోనూ పుస్తకాల ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదని గ్రంథాలయాలు జ్ఞానానికి ఆలయాలుగా నిలుస్తున్నాయని తెలిపారు.జిల్లాలోని గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని పాఠకులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని వీరబాబు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పఠన సంస్కృతి పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. గ్రంథాలయంలో చదివి ఎక్సైజ్ శాఖలో ఉద్యోగం సాధించిన ఉపేంద్రరావు గ్రంథాలయానికి రూ.5000 విలువగల కూలర్ అందించడంతో చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రిటైర్డ్ ప్రభుత్వఉద్యోగుల బెనిఫిట్స్ లను వెంటనే విడుదల చేయాలి

**..బెల్లంపల్లి టిఆర్ఇఏ శాఖ అధ్యక్షుడు సాధు లింగయ్య**



**బెల్లంపల్లి, మహా:** రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులందరికీ బెనిఫిట్స్ వెంటనే ఏక మొత్తంగా విడుదల చేయాలని, పిఆర్సిని సైతం అమలు చేయాలనిబెల్లంపల్లి టిఆర్ఇఏ శాఖ అధ్యక్షుడు సాధులింగయ్య పేర్కొన్నారు. తాండూరు మండలంలో ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయులైన మాసాడిశ్రీరాములుగట్టు శ్రీహరి,ముద్దు రాంబాబు,ఇందూరి ఆశన్న లను తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యత్వం నుఇవ్వడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ 2024వ సం. ఏప్రిల్ నుండి రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులందరికీ వారి బెనిఫిట్స్ వెంటనే ఏక మొత్తంగా విడుదల చేసి పిఆర్సిని అమలు చేయాలని ,బకాయి ఉన్న ఐదు డిఏలను వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, 398 వేతనంపై నియుక్తులైన స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రభుత్వం అలసత్వం వహిస్తే దశలవారీగా ఉద్యమిస్తామని ఎంతటి పోరాటాల కైనా సిద్ధమని టిఆర్ఎస్ సంఘము అన్ని పోరాటాలు చేయడానికి సిద్ధంగా ఉందని తెలియజేశారు.బెల్లంపల్లి టిఆర్ఇఏ శాఖ అధ్యక్షుడు సాధు లింగయ్య కార్యదర్శి కే నర్సయ్య ఆర్థిక కార్యదర్శి జగన్మోహన్ చారి, ముఖ్యసలహాదారులు అక్కపెల్లిబాపు, వైకుంఠం ల ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జరిగింది.

## సీయంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** పేద బడుగు బలహీన వర్గాల సంక్షేం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆయన గురువారం తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషతో కలిసి లబ్దిదారులకు అందించారు. సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సంతోష్‌రావు కాంగ్రెస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## శనగ రైతులు ఆందోళన చెందవద్దు-కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** తమ పంట కొనుగోలు జరగడం లేదని శనగ రైతులు ఆందోళన చెందవద్దని త్వరలోనే మిగతా పంట కొనుగోళ్లు జరుగుతాయని ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.గురువారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మీడియతో మాట్లాడారు. కొన్ని కారణాల వల్ల కొనుగోళ్లతో జాప్యం జరిగిన మాట వాస్తవమేనని కాని పరిస్థితిని రైతులు అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నానన్నారు.ఇదే విషయమై తాను వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో ఫోన్ లో మాట్లాడినట్టు తెలిపారు. త్వరలోను పంట కొనుగోళ్ళు మొదలవుతాయన్నారు.రైతులు ఎలాంటి అనవసర ఆందోళలనలు మనసులో పెట్టుకోవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వాసవీ మాత జన్మోత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు ప్రభుత్వ నిర్ణయం

**హర్షం వ్యక్తం చేసిన ఆర్యవైశ్యులు, కాంగ్రెస్ శ్రేణులు**
**కంది శ్రీనివాస రెడ్డితో కలిసి సీయంచిత్రపటానికి పాలిభిషేకం**



**ఆదిలాబాద్, మహా :** వాసవీ కన్యకాపరమేశ్వరి జన్మోత్సవాలను తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా జరిపేందుకు నిర్ణయిస్తూ జీవో జారీ చేయడం ఆనందంగా ఉందని ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజక వర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. గురువారం ఆయన పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతున్న ఉత్సవాలకు హాజరయ్యారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. ఆలయంలో కంది శ్రీనివాస రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి జన్మోత్సవాలను అధికారికంగా జరిపేందుకు ప్రభుత్వ నిర్ణయం ఆర్యవైశ్యుల గౌరవాన్ని పెంచేవిధంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ఎల్లప్పుడు అందరిపై ఉండాలని వేడుకున్నారు.అనంతరం సీయం రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఆర్యవైశ్యులతో కలిసి పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష , ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు ,ఆర్యవైశ్య సంఘ నాయకులు రాజేశ్వర్ , లోక ప్రవీణ్ రెడ్డి ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికులు విధుల్లో చేరాలని కంది శ్రీనివాస రెడ్డి విజ్ఞప్తి



**ఆదిలాబాద్ మహా :** తెలంగాణ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తుందని విద్యార్థులు ప్రయాణీకుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని సమ్మె విరమించాలని ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కోరారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణా లో ప్రభుత్వం ఏర్పడటానికి కార్మికులు కూడా సహకారం అందించారని అన్నారు. కాని సమ్మె కారణంగా విద్యార్థులు ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. త్వరలో సమస్యలు పరిష్కరించబడతాయని ఆశాభావం వ్యక్తం చేసారు. ప్రజల బాధలు అర్థం చేసుకుని వెంటనే సమ్మె విరమించి విధుల్లో చేరాలని కోరుతున్నానన్నారు.

## మహాప్రజ్ఞ బుద్దవిహార్ ప్రారంభోత్స పోస్టర్లు ఆవిష్కరించిన కంది శ్రీనివాస రెడ్డి



**ఆదిలాబాద్ మహా :** ఈనెల 26న జైనథ్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో మహాప్రజ్ఞ బుద్ధవిహార్ ప్రారంభోత్సవం ఉంటుందని ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి కోరారు. గురువారం ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వాహకులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. భౌద్ధుని బోధనలు ప్రచారం చేయాలన్న ఉద్దేశంతో గ్రామంలో ఆలయాన్ని నిర్మించుకున్నారన్నారు. తాయిలాండ్ నుండి విగ్రహాన్ని కూడా తెచ్చుకున్నారని 26న విగ్రహ ప్రతిష్టాపన తో మహాప్రజ్ఞ బుద్ధవిహార్ ప్రారంభమవుతుందన్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి



**ఆదిలాబాద్ మహా:** మహర్షి భగిరథుడు కఠినమైన దీక్షను చేసి గంగాను భూమిపైకి తీసుకువచ్చారని మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహర్షి భగిరథుని జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో భగిరథుని చిత్రపటానికి అదనపు కలెక్టర్ చిత్రు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి పూలామలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ.భగిరథుడు ఇక్ష్వాకు వంశానికి చెందిన పవిత్ర పురాన రాజు అని తన పూర్వికులైన సాగరపుత్రుల ఆత్మలకు మోక్షం ప్రసాదించడానికి ఆకాశం నుండి గంగను భూమికి తీసుకువచ్చేలా కఠోర తపస్సు చేశారని గుర్తు చేశారు. అప్పుడే తమ పూర్తికుల ఆత్మ శాంతించిందని భగిరథుడు నమ్మడని తెలిపారు. మన లక్ష్యాన్ని చేరేందుకు ఎన్నో కష్టాలు ఎదురవుతాయని వాటిని అదిగమించి లక్ష్యంవైపు పయనమవ్వాలన్నారు. దానికి భగిరథుడి కఠోర తప్పును ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ వర్ణ, బీసీ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ స్కూళ్ల బుక్స్ మాఫియాపై
# ఎన్‌హెచ్ఆర్సీ ఉక్కుపాదం

- **ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సీరియస్**
- **స్కూల్ బ్యాగ్ విధానం అమలు చేయాల్సిందే**
- **తెలంగాణ సహా పలు రాష్ట్రాల సీఎస్లకు ఆదేశాలు**
- **ప్రైవేట్ పుస్తకాలు కొనాలని ఒత్తిడి చేస్తే చర్యలు తప్పవు**
- **స్కూళ్ల దోపిడీపై యాక్షన్ టేకెన్ రిపోర్ట్ సమర్పించండి**
- **రాష్ట్ర ప్రభుత్వాలకు గడువు విధింపు**

**హైదరాబాద్, మహా:** దేశవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు సాగిస్తున్న పుస్తకాల దందాపై జాతీయ మానవ హక్కుల కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రైవేట్ పబ్లిషర్ల పుస్తకాలను అధిక ధరలకు కొనాలంటూ తల్లిదండ్రులపై పాఠశాలలు చేస్తున్న ఒత్తిడిని తీవ్రంగా పరిగణించిన కమిషన్, దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ సహా దేశంలోని పలు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు, కేంద్రపాలిత ప్రాంతాల అడ్మినిస్ట్రేటర్లకు అధికారికంగా నోటీసులు జారీ చేసింది. ముఖ్యంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ ప్రైవేట్ పుస్తకాల విక్రయాలపై అందిన ఫిర్యాదుల నేపథ్యంలో, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి 'యాక్షన్ టేకెన్ రిపోర్ట్' సమర్పించాలని కమిషన్ తన నోటీసులో స్పష్టంగా పేర్కొంది. తల్లిదండ్రుల నుంచి వస్తున్న ఫిర్యాదుల ప్రకారం, చాలా పాఠశాలలు ఎన్సీఈఆర్టీ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పుస్తకాలకు బదులుగా, ప్రైవేట్ పబ్లిషింగ్ సంస్థలతో కుమ్మక్కై అధిక ధరల పుస్తకాలను విక్రయిస్తున్నట్లు వెల్లడైంది. ఇది ఆర్థిక దోపిడీ కిందకు వస్తుందని, విద్యార్థుల హక్కులను కాలరాయడమేనని ఎన్హెచ్ఆర్సీ అభిప్రాయపడింది. 'జాతీయ స్కూల్ బ్యాగ్ విధానం' ప్రకారం విద్యార్థులపై భారం తగ్గించాలని, అనవసరమైన పుస్తకాలను రుద్దకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ, పాఠశాలలు వాటిని తుంగలో తొక్కుతున్నాయని కమిషన్ అసహనం వ్యక్తం చేసింది. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేట్ స్కూళ్లపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ నోటీసుల నేపథ్యంలో విద్యాశాఖ అధికారుల్లో చలనం మొదలైంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి పలు రాష్ట్రాల సీఎస్లకు ఈ ఆదేశాలు అందాయి. స్కూల్ బ్యాగ్ పాలసీని కచ్చితంగా అమలు చేయడంతో పాటు, ప్రైవేట్ పుస్తకాల విక్రయాలను అరికట్టేందుకు తీసుకుంటున్న వ్యూహాలను నివేదికలో పొందుపరచాలని ఎన్హెచ్ఆర్సీ సూచించింది. ఒకవేళ పాఠశాలలు తమ తీరు మార్చుకోకపోతే కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే వాటి గుర్తింపును రద్దు చేసే దిశగా అడుగులు వేయాలని కేంద్ర కమిషన్ భావిస్తోంది.

## విజయవాడ హైవేపై ట్రాఫిక్ కష్టాలకు చెక్

- **ఎల్బీనగర్ - హయత్ నగర్ 'డబుల్ డెక్కర్' మ్యాజిక్!*₹941 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ విప్లవం**
- **20 లక్షల మందికి రవాణా విముక్తి**
- **గడ్కరీతో భేటీకి రంగం సిద్ధం**
- **మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**హైదరాబాద్, మహా:** భాగ్యనగర తూర్పు ముఖద్వారమైన ఎల్బీనగర్ నుంచి హయత్ నగర్ వరకు నిత్యం నరకప్రాయంగా మారుతున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేగవంతం చేసింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 7.1 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పురోగతిపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గురువారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సుమారు ₹941 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించనున్న ఈ మెగా ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుంటూ, తన వాటాగా ₹200 కోట్లను అందించేందుకు తక్షణమే అంగీకారం తెలిపింది. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే మహారాష్ట్రలోని నాగపూర్ తర్వాత దేశంలోనే రెండో అతిపెద్ద డబుల్ డెక్కర్ కారిడార్‌గా ఇది చరిత్ర సృష్టించనుంది. హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ట్రాఫిక్ ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, దాదాపు 20 లక్షల మంది ప్రయాణికులకు ఈ ప్రాజెక్టు ద్వారా గొప్ప వెసులుబాటు కలగనుంది. ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా, రవాణా వ్యవస్థలో ఇదొక నూతన శకానికి నాంది కాబోతోంది. ఈ కారిడార్‌ను కేవలం ఒక రవాణా మార్గంగానే కాకుండా, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన 'ప్రమాద రహిత కారిడార్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల నిత్యం ప్రమాదాలకు నిలయంగా మారుతున్న ఈ మార్గంలో ప్రయాణం సురక్షితం కానుంది. ఈ భారీ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన అనుమతులను వేగవంతం చేసేందుకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇందులో భాగంగానే వచ్చే వారం ఢిల్లీకి వెళ్లి కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ఆయన ప్రత్యేకంగా భేటీ కానున్నారు.

## జాతి కుంట చెరువు సుందరీకరణ పనులు ప్రారంభం

**పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ దావా స్వాతి రమేష్ బాబు**



**బెల్లంపల్లి, మహా:** జాతికుంట చెరువు సుందరీకరణ పనులు ప్రారంభం కాగా గురువారం నాడు బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూచెరువు హద్దుల్లో అక్రమ నిర్మాణాలు ఉన్నట్లయితే తొలగించేలా చర్యలు చేపడతామని స్పష్టంచేశారు.బెల్లంపల్లి శాసనసభ్యులు గడ్డం. వినోద్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీలోని పురాతన జాతికుంట చెరువు సుందరీకరణ పనులలో భాగంగా చేపట్టిన చెరువు విస్తీర్ణం సర్వేను పర్యవేక్షించారు.జాతి కుంట చెరువును గతంలో పలువురు ఆక్రమణదారులు కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు వార్డ్ ప్రజలు తమదృష్టికి తీసుకొచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాలతో నిబంధనల ప్రకారం సంబంధిత అధికారుల ద్వారా చెరువు భూమిని పూర్తిస్థాయిలో సర్వే చేయించి, హద్దులను ఖరారు చేయిస్తామని,చెరువుహద్దుల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టి ఉంటే తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దళితరత్న అవార్డు గ్రహీతలకు సన్మానం

**..రాష్ట్ర టిపిసిసి ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి**



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణానికి చెందిన మాదిగ హక్కుల దండోరా నాయకులకు దళిత రత్న అవార్డు రావడంతో రాష్ట్ర టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో దళిత అణగారిన వర్గాల పైన జరుగుతున్న అగ్రకుల దాడులు,పరువు హత్యలు ,అత్యాచారాలు, మానభంగాలు,బహిష్కరణలపై ఎప్పటికప్పుడు ఖండిస్తూ అణగారిన వర్గాలకు అండగా నిలబడి వారి ఆత్మగౌరవం కోసం జాతిని చైతన్య పరుస్తూ సామాజికఉద్యమాలు చేస్తూజాతి ఐక్యత కోసం కృషి చేస్తున్న వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాన్ని పురస్కారంచూకొని రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లోని రవీంద్ర భారతి కళావేదిక లో రాష్ట్ర ఎస్సీ ఎస్టీ దివ్యాంగుల శాఖ మాత్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆదేశాల మేరకుమాదిగ హక్కుల దండోరా జాతీయ అధ్యక్షుడు దండు సురేందర్ మాదిగ చేతుల మీదుగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న దళితరత్న అవార్డును బెల్లంపల్లి పట్టణనికి చెందిన మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగారపు రమేష్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి అకునూరి రాజ్కుమార్,పట్టణ అధ్యక్షుడు ఎనగందుల శివాజీ ,బెల్లంపల్లి నియోజక వర్గం చాకేపల్లి చెందిన జిల్లా అధికార ప్రతినిధి గోగర్ల శేఖర్ లకు రావడం శుభ పరిణామం అన్నారు. సంఘ పటిష్ఠతకు సామాజిక చైతన్యానికి కృషిచేయాలని ఈ సందర్భంగా సూచించారు.అలాగే గారికి ఇవ్వడాన్ని స్వాగతిస్తూ వారిని అభినందిస్తున్నారుఅలగే ఈ అవార్డు మరింత మీ బాధ్యతను పెంచిందని ,బాధ్యతయుతంగా అణగారిన వర్గాలకు అండగా నిలిచి ప్రజల మన్ననలను పొంది మరిన్ని అవార్డు లను అందుకోవాలని అన్నారు.

## ఆడబిడ్డల నమ్మకద్రోహి కాంగ్రెస్ పార్టీ




- **మహిళా రిజర్వేషన్లపై బీఆర్ఎస్ ద్వంద్వ నీతి**
- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నారపురాజు రామచంద్రరావు ఫైర్**
- **హైదరాబాద్‌లో 'మహిళా జన్ ఆక్రోశ్' గర్జన**
- **హైదరాబాద్‌లో బీజేపీ భారీ ర్యాలీ**

**హైదరాబాద్, మహా:**రాజధాని నగరంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహిళా జన్ ఆక్రోశ్ ర్యాలీ' అత్యంత ఉద్వేగభరితంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన మహిళా లోకంతో హైదరాబాద్ వీధులు కాషాయమయమయ్యాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు నారపురాజు రామచంద్రరావు పాల్గొని కాంగ్రెస్ పార్టీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దశాబ్దాల కాలంగా కాంగ్రెస్ పార్టీ దేశ మహిళలను ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ఎలా వాడుకుందో, వారికి ఎలా నమ్మకద్రోహం చేసిందో ఆయన వివరించారు. కాంగ్రెస్ చేసిన ఈ చారిత్రక తప్పిదాలను, ఆడబిడ్డలకు చేసిన అన్యాయాన్ని దేశం ఎన్నటికీ క్షమించబోదని ఆయన స్పష్టం చేశారు. నేటి ర్యాలీలో మహిళలు ప్రదర్శించిన ఆగ్రహం, వారిలో కనిపిస్తున్న స్పష్టత రాబోయే రోజుల్లో ఆ పార్టీకి ఒక బలమైన హెచ్చరిక అని ఆయన అభివర్ణించారు. మరోవైపు, ప్రాంతీయ పార్టీ అయిన బీఆర్ఎస్ తీరును కూడా రామచంద్రరావు ఎండగట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో బీఆర్ఎస్ ప్రదర్శించిన ద్వంద్వ వైఖరిని ఆయన తీవ్రంగా విమర్శించారు. మహిళా ప్రాతినిధ్యం గురించి మాట్లాడే నైతిక హక్కు ఆ పార్టీకి లేదని, దీనికి నిదర్శనమే కేసీఆర్ మొట్టమొదటి మంత్రివర్గంలో కనీసం ఒక్క మహిళా మంత్రి కూడా లేకపోవడమని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ పార్టీ చరిత్ర అంతా మహిళలను విస్మరించడమేనని, అటువంటి వారు నేడు మహిళా హక్కుల గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని మండిపడ్డారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న వంచనాత్మక రాజకీయాలను, విరుద్ధ వైఖరిని మహిళలు ఈ వేదిక ద్వారా దీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారని ఆయన ప్రకటించారు.ఈ మహా సభకు బీజేపీ అగ్రనేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహిళా చైతన్యాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఈటల రాజేందర్, లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డి.కె. అరుణ తమ ప్రసంగాలతో మహిళల్లో స్ఫూర్తిని నింపారు. ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి , ఎమ్మెల్సీ కొమరయ్య తో పాటు పలువురు ప్రముఖ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని, కాంగ్రెస్ , బీఆర్ఎస్ పార్టీల వైఫల్యాలను ఎండగట్టారు.

# ఆధ్యాత్మిక గడ్డపై ప్రధాని అడుగు





- **సన్యాసి కావాలనుకున్న చోటే దేశ ప్రధానిగా బెలూరు మఠంలో మోదీ భావోద్వేగ పర్యటన**
- **వివేకానందుడి ధ్యాన గదిలో ఏకాంతం**
- **మానవ సేవయే పరమావధి**

రామకృష్ణ మిషన్ నుంచి దేశానికి మోదీ సందేశం.

**కోల్‌కత్తా,మహా.** పశ్చిమ బెంగాల్ పర్యటనలో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ హౌరాలోని రామకృష్ణ మఠం , రామకృష్ణ మిషన్ ప్రధాన కార్యాలయమైన బెలూరు మఠాన్ని సందర్శించారు. ఈ పర్యటన కేవలం ఒక రాజకీయ నాయకుడి అధికారిక పర్యటనలా కాకుండా, ఒక ఆధ్యాత్మిక సాధకుడి అంతర్మథనంలా సాగింది. బెలూరు మఠానికి చేరుకున్న ప్రధానికి అక్కడి సన్యాసులు వేద మంత్రోచ్చారణల మధ్య ఘన స్వాగతం పలికారు. ప్రధాని మోదీ ఈ క్షేత్రాన్ని తన 'సొంత ఇల్లు'గా మరియు ఒక 'తీర్థయాత్ర'గా అభివర్ణించారు. ముఖ్యంగా స్వామి వివేకానందుడి సిద్ధాంతాల పట్ల ఆయనకు ఉన్న అచంచలమైన విశ్వాసం ఈ పర్యటనలో స్పష్టంగా కనిపించింది. పశ్చిమ బెంగాల్ సంస్కృతి, ఆధ్యాత్మికత మరియు మా కాళీ ఆరాధన వంటి అంశాలను ప్రస్తావిస్తూ, దేశాభివృద్ధిలో ఆధ్యాత్మిక శక్తి పాత్రను ఆయన ఉద్ఘాటించారు.నరేంద్ర మోదీకి బెలూరు మఠంతో దశాబ్దాల కాలంగా ఎంతో లోతైన భావోద్వేగ అనుబంధం ఉంది. యువకుడిగా ఉన్న సమయంలో ఆయన ప్రాపంచిక సుఖాలను వదిలి సన్యాసం స్వీకరించాలని భావించి, రామకృష్ణ మిషన్‌లో చేరాలని మూడుసార్లు ప్రయత్నించారు. అయితే అప్పటి మఠం పెద్దలు ఆయనను విద్యాభ్యాసంపై దృష్టి పెట్టాలని, ఆయన సేవలు దేశానికి మరో రూపంలో అవసరమని సూచించి వెనక్కి పంపారు. ఆనాడు సన్యాసిగా మారాలని కోరుకున్న వ్యక్తి, నేడు దేశ ప్రధానిగా అదే మఠానికి రావడం అక్కడి సన్యాసులను కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. గత పర్యటనల సమయంలో తన ఆధ్యాత్మిక గురువు స్వామి ఆత్మస్థానంద ఆశీస్సులు తీసుకున్న జ్ఞాపకాలను మోదీ గుర్తుచేసుకున్నారు. తన జీవిత గమనాన్ని మార్చిన ఈ పవిత్ర స్థలంలో గడపడం తనకు గొప్ప శక్తినిస్తుందని ఆయన పలు సందర్భాల్లో పేర్కొన్నారు.ఈ పర్యటనలో అత్యంత కీలకమైన ఘట్టం స్వామి వివేకానందుడి ధ్యాన గదిలో ప్రధాని గడిపిన సమయం. వివేకానందుడి పాదుకల వద్ద కూర్చుని సుమారు 15 నిమిషాల పాటు మోదీ నిశ్శబ్దంగా ధ్యానం చేశారు. ఆ గదిలోకి వెళ్ళగానే ఆయన కళ్ళు చెమర్చడం, ఎంతో నిశ్శబ్దంగా అక్కడి ఆధ్యాత్మిక తరంగాలను అనుభూతి చెందడం అక్కడి వారిని కదిలించింది. రామకృష్ణ పరమహంస, శారదా దేవి, స్వామి వివేకానంద మరియు స్వామి బ్రహ్మానంద ఆలయాలను సందర్శించి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మఠం అధికారులు ఆయనకు ధోవతి, శాలువా మరియు ప్రసాదంతో పాటు రామకృష్ణ మిషన్ ప్రచురించిన ఆధ్యాత్మిక పుస్తకాలను బహూకరించారు. దేశ యువత వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకుని నవ భారత నిర్మాణంలో భాగస్వాములు కావాలని, సేవ, త్యాగం అనే ఆశయాలతో ముందుకు సాగాలని ఈ సందర్భంగా మోదీ ఆకాంక్షించారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | శుక్రవారం, హైదరాబాద్ | 24-04-2026







## ఆ వార్తల్లో నిజం లేదు!

అగ్ర కథానాయిక దీపికా పడుకోన్ ఇటీవలే ప్రెగ్నెట్ అయింది. రణ్‌వీర్-దీపికా దంపతులు రెండో సంతానం కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. అయితే గర్భం కారణంగా దీపికా పడుకోన్ ప్రస్తుతం తాను చేస్తున్న సినిమాల నుంచి విరామం తీసుకోనుందని, ముఖ్యంగా అల్లు అర్జున్ గ్లోబల్ ప్రాజెక్ట్ 'రాకా' నుంచి ఆమె తప్పుకునే అవకాశాలున్నాయని సోషల్‌మీడియాలో ప్రచారం జరుగుతున్నది. వీటిపై నిర్మాణ సంస్థ సన్‌పిక్చర్స్ స్పందించింది. 'షెడ్యూల్ ప్రకారమే షూటింగ్ జరుగుతున్నది. ఈ సినిమాలో దీపికా పడుకోన్ కీలక పాత్రను పోషిస్తున్నారు. ఆమె ఉత్సాహంగా షూట్‌లో పాల్గొంటున్నారు' అంటూ మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. దీంతో సోషల్‌మీడియా వార్తలన్నీ పుకార్లని తేలిపోయింది. 'రాకా' సినిమా కోసం కథానుగుణంగా దీపికా పడుకోన్‌పై కొన్ని యాక్షన్ ఘట్టాలను చిత్రీకరించాల్సి ఉందట. ఆమె గర్భవతి కావడంతో వైద్యపరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ యాక్షన్ సీన్‌స్‌ను త్వరితగతిన పూర్తి చేసే ఆలోచనలో చిత్రబృందం ఉందని తెలిసింది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న సైంటిఫిక్ థ్రిల్లర్ 'రాకా' వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకురానుంది.

## అవాస్తవాలు ఆవేదనను కలిగించాయి

### సాయి పల్లవి

సౌత్ ఇండియా స్టార్ నటి సాయి పల్లవి తన నటనతో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు పొందారు. తమిళనాడులోని కోయంబత్తూర్‌కు చెందిన ఈ బ్యూటీ వైద్య విద్యను పూర్తి చేసి భారతీయ కథానాయకిగా విజయం సాధించారు. ప్రేమమ్ అనే మలయాళ చిత్రం ఈమె సినీ జీవితాన్ని మలుపుతిప్పింది. ఆ తరువాత తెలుగు, తమిళం భాషల్లో నటిస్తూ అగ్ర కథానాయికిగా రాణిస్తున్నారు. తాజాగా హిందీ ప్రేక్షకుల మనసులను దోచుకోవడానికి సిద్ధం అవుతున్నారు. హిందీలో సాయిపల్లవి కథానాయకిగా నటించిన ఏక్ దిన్ చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది. ప్రస్తుతం రామాయణ అనే రెండు భాగాలుగా రూపొందుతున్న చిత్రాల్లో సీతగా నటిస్తున్నారు. సాయిపల్లవిని చాలా మంది నటీమణుల మాదిరిగానే ఒక విషయం గాయపరిచింది. ఈమె గత రెండేళ్ల క్రితం ఒక ఇంటర్వ్యూలో మీరు మలయాళి కదా తెలుగులో ఎలా మాట్లాడగలుగుతున్నారు అనే ప్రశ్నకు తాను మలయాళీ కాదు తమిళమ్మాయి అని బదులిచ్చారు. ఆ విషయాన్ని వక్రీకరించి రెండేళ్ల తరువాత ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి ప్రచారం తనను చాలా బాధించిందన్నారు.

## తెలుగులో బంపరాఫర్

తెలుగు ఇండస్ట్రీలో స్ట్రాంగ్ కమ్‌బ్యాక్ కోసం ఎదురుచూస్తున్నది మంగళూరు సోయగం కృతిశెట్టి. 'ఉప్పెన' తర్వాత ఈ సొగసరికి టాలీవుడ్‌లో వరుస అవకాశాలు వరించినా.. అందులో చాలా సినిమాలు బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలయ్యాయి. దాంతో గత రెండేళ్లుగా తెలుగు సినిమాలకు విరామం ప్రకటించింది. తాజా సమాచారం ప్రకారం ఈ భామ టాలీవుడ్‌లో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వెంకటేష్-కల్యాణ్‌రామ్ కాంబోలో దర్శకుడు అనిల్ రావిపూడి రూపొందిస్తున్న మల్టీస్టారర్ చిత్రంలో కృతిశెట్టి ఓ నాయికగా ఎంపికైనట్లు సమాచారం. ఆమె కల్యాణ్‌రామ్ సరసన జోడీ కట్టబోతున్నట్లు ఫిల్మ్‌నగర్ టాక్. వెంకటేష్‌కు జతగా కీర్తి సురేష్ నటించనుందని తెలుస్తున్నది. జూన్‌లో ఈ సినిమాను సెట్స్‌మీదకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020,
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com